

Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 16.09.2016, శుక్రవారం సంపుటి : 36 సంచిక : 15 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com





- చంద్రబాబుకు పోల'వరం'
- అసెంబ్లీ సంఖ్య పెంపుకు అంగీకారం
- ఓటు-నోటు నుండి మోక్షమార్గం
- స్వార్ధ ప్రయోజనాల కోసం బలైన ప్రజా ప్రయోజనాలు

## డీల్ కుదిరింది... హోదా ఆగింది!

# ఏపికి 'ప్రత్యేక' ద్రోహం

**విభజన సమయంలో...** తల్లిని చంపి బిడ్డను బయటకు తీసారు. ఏపికి ప్రత్యేకహోదా ఐదేళ్లు సరిపోదు, పదేళ్లు కావాలి. కాంగ్రెస్ వాళ్లు ఇవ్వకపోయినా మేం అధికారంలోకి రాగానే ఇస్తాం...

**అధికారంలోకి వచ్చాక...** ఏపికి ప్రత్యేకహోదాను పరిశీలిస్తున్నాం.

**ఏడాది గడిచాక...** ఏపికి ప్రత్యేకహోదా ఇవ్వడానికి పలు రాష్ట్రాల నుండి అభ్యంతరాలు వస్తున్నాయి.

**రెండేళ్ల తర్వాత...** వచ్చే ఏడాది నుండి అన్ని రాష్ట్రాలలోనూ ప్రత్యేకహోదాను ఎత్తేస్తున్నాం. మిమ్మల్ని ప్రత్యేక అడుక్కునే రాష్ట్రంగా గుర్తించి ప్రత్యేక ప్యాకేజీని అందిస్తున్నాం. పండుగ చేసుకోండి.

రెండున్నరేళ్ల కాలంలో మనం ఎన్ని మార్పులు చూసాం... నాయకుల నోట ఎన్నిరకాల మాటలు విన్నాం... అసలు క్రమశిక్షణకు మారుపేరుగా, సిద్ధాంతాల పునాదులపై నిర్మించబడ్డ పార్టీగా చెప్పుకుంటున్న బీజేపీ నాయకులేనా... ఇన్ని రకాలుగా మాట్లాడింది. ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబు పలు రకాలుగా మాట్లాడారంటే ప్రజలు ఆశ్చర్యపడరు. ఎందుకంటే అందరికీ ఆయన గురించి తెలిసిందే! మరి బీజేపీ నాయకులకేమైంది? మాటను నిలబెట్టుకుంటాడనే పేరున్న ప్రధాని నరేంద్రమోడీకి ఏమైంది. ఆయన రాజధర్మం ఇదేనా? కేవలం ఇతర రాష్ట్రాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయని ఏపికి ప్రత్యేకహోదా ఎగ్గొట్టడమేమిటి? ఈరోజు హోదా కంటే ప్యాకేజీయే మేలంటూ కల్లబొల్లి కబుర్లు చెప్పడమేంటి? ఆయన ప్యాకేజీతో ఎవరికి మేలు జరుగుతుంది.

ప్రధానిగా నరేంద్రమోడీ స్థానంలో వాజ్‌పేయి లేదా అద్వానీ వంటి జాతీయ నాయకులు ఉండుంటే ఏపికి ఈ అన్యాయం జరిగేదా? ఖచ్చితంగా జరిగి ఉండేది కాదు. ఎందుకంటే ఒక జాతీయ నాయకుడికి, ఒక ప్రాంతీయ నాయకుడికి మధ్య ఉండే తేడా అదే! వాజ్‌పేయి, అద్వానీలు జాతీయ నాయకులు. దేశంలోని ప్రతి అణువు వారికి తెలుసు. ఏ రాష్ట్రంలో ఏ సమస్య వుంది, ఆయా రాష్ట్ర ప్రజల సెంటిమెంట్లు, అలవాట్లు, సంప్రదాయాలు వారికి తెలుసు. ప్రాంతీయ సంకుచిత ధోరణి వారిలో కనిపించదు. కన్యాకుమారి నుండి కాశ్మీర్ దాకా అన్ని రాష్ట్రాలను ఒకే విధంగా చూసే జాతీయ ఉత్తమనేతలు వాళ్ళు. వాళ్లే ప్రధానిగా ఉండుంటే ఏపికి ఈ దశలో ప్రత్యేకహోదా వచ్చి ఉండేది. నరేంద్రమోడీ ఒక్కసారిగా జాతీయ రాజకీయాలలోకి వచ్చాడు. అంతకుముందు ఆయన దేశ వ్యాప్తంగా పర్యటించిన సందర్భాలు లేవు. వివిధ రాష్ట్రాల (మిగతా 11వ పేజీలో)

## • దసరా ధమాకా...

# మంత్రి కుర్చీ ఎవరిది?




దసరాకు చంద్రబాబు తన మంత్రి వర్గంలో మార్పులు చేర్పులు చేయబోతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా త్వరగా ముఖ్యమంత్రి కావాలని తన తనయుడు లోకేష్‌కు ట్రైనింగ్ ప్రోగ్రామ్ క్రింద తన కేబినెట్‌లో చేర్చుకునేందుకే ఈ కూర్పు చేపట్టనున్నట్లు సమాచారం. అయితే కేవలం లోకేష్ ఒక్కడి కోసమే కేబినెట్‌ను మారిస్తే ఎంత అప్రదిష్ట. ఇందులో భాగంగా వున్నవారిలో కొందరికి మంత్రి పదవులు వూడబెరకడం, ఇంకొందరికి కొత్తగా ఇవ్వడం ఉంటుంది.

పదవులు ఊడేవారి లిస్టులో పత్తిపాటి పుల్లారావు, బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, పీతల సుజాత, కొల్లు రవీంద్ర, రావెల కిషోర్‌బాబు, పి.నారాయణల పేర్లు వినిపిస్తున్నాయి. కొత్తగా తీసుకునేవారిలో ఆకే అమర్‌నాథ్‌రెడ్డి, భూమా నాగిరెడ్డి, జలీల్‌ఖాన్‌ల పేర్లు వినిపిస్తున్నాయి. చిత్తూరుజిల్లాలో అంటే బొజ్జలను తీసేసి అమర్‌నాథ్‌రెడ్డికి ఇస్తే సామాజిక వర్గం పరంగా బ్యాలెన్స్ అవుతుంది. క్యాబినెట్‌లో మరో ఇద్దరు రెడ్లకు అవకాశం కల్పించాలనే ఆలోచన వుంది.

(మిగతా 11వ పేజీలో)

## బాబు డైరక్షన్ •

# పవన్ యాక్షన్



ఆంధ్రప్రదేశ్ ప్రజలకు పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ పెద్ద పజిల్‌గా తయారయ్యాడు. ఆయన పంథా ఏంటో, ఆయన మార్గమేంటో, ఆయన ఆశయమేంటో... అర్ధంకాక తలలు పట్టుకు ఛస్తున్నారు. ప్రత్యేకహోదా కావాలంటాడు. ప్రజలను మాత్రం ఉద్యమాలు చేయొద్దంటాడు. తెలంగాణపై ప్రేమంటాడు... ఆంధ్రా కోసం కన్నీళ్లు కారుస్తాడు. తన వద్ద డబ్బులు లేవంటాడు... ప్రత్యేక విమానాలలో తిరుగుతుంటాడు. ఫ్యాక్షనిజం, మావోయిజం, రౌడీయిజం, టెర్రరిజం... ఈ యిజాలన్నింటికీ అర్ధాలు తెలిసిన ప్రజలు పవనిజం అర్ధంకాక జుట్టు పీక్కుంటున్నారు.

పవన్ కళ్యాణ్ పెట్టిన తిరుపతి, కాకినాడ సభలు చూసాక, ఆయన ప్రసంగాలు విన్నాక... ప్రజలకి ఒకటి మాత్రం అర్ధమైపోయింది. పవన్ స్వతహాగా ఈ సభలు పెట్టడం లేదని, ఎవరో డైరక్షన్ చేస్తున్నారని! కాకినాడ సభ తర్వాత పవన్ యాక్షన్ వెనుక వున్న ఆ డైరెక్టర్ చంద్రబాబేనని చాలామంది నమ్మకం. స్వల్పకాలంలో భారీ

(మిగతా 11వ పేజీలో)

# నెల్లూరుపై ఉగ్రనీడ?



ఫ్యాక్షనిజం గొడవలు, మావోయిస్టుల మందుపాతర పేలుళ్లు వంటి వాటికి దూరంగా ఎంతో ప్రశాంతంగా ఉండే నెల్లూరులో బాంబు పేలుడు కలకలం సృష్టించింది. అందరిలోనూ ఆందోళన కలిగిస్తోంది.

(మిగతా 11వ పేజీలో)

# పోలేరమ్మ జాతరకు ముమ్మర ఏర్పాట్లు



ఈ నెల 21, 22 తేదీలలో జరుగనున్న వెంకటగిరి పోలేరమ్మ జాతరకు ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. గతేడాది జాతరలో విఐపి దర్శనాలకు ఎక్కువ ప్రాధాన్యతినిచ్చారన్న ఆరోపణలు రావడంతో ఈసారి విఐపి పాస్‌లను రద్దు చేశారు. వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కూడా తాను 500రూపాయల టిక్కెట్ కొని అమ్మవారి దర్శనం చేసుకుంటానని చెప్పి మిగతావారికి ఆదర్శంగా నిలిచారు. ఈసారి స్టీల్ బారికేడ్లతో క్యూలైన్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఇటీవల నెల్లూరులోని జిల్లా కోర్టులో జరిగిన బాంబు పేలుడును దృష్టిలో పెట్టుకుని భారీ బందోబస్తు, సి.సి.కెమెరాలు, డ్రోన్‌లతో గట్టి నిఘాను ఏర్పాటు చేస్తున్నారు. వివిఐపిలకు పోలీసు భద్రత మధ్య అమ్మవారి దర్శనం కల్పిస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం షామియానాలు, తాగునీళ్లు, టాయ్‌లెట్లు ఏర్పాటు చేస్తున్నారు. వెంకటగిరితో పాటు జిల్లాలోని పలు డిపోల నుండి జాతరకు ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. జిల్లాలోనే ఎంతో చారిత్రక ప్రసిద్ధిగాంచిన పోలేరమ్మ జాతరకు భక్తులు లక్షల సంఖ్యలో వస్తుంటారు. దానికనుగుణంగా ఏర్పాట్లు చేయడానికి ప్రభుత్వ శాఖలు సిద్ధమయ్యాయి.

సింహపురి సమాచారం

# 22న ఎస్పీ సాంబమూర్తి వర్ధంతి సభ

ప్రముఖ సినీ గాయకులు పద్మభూషణ్ డాక్టర్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తండ్రి స్వర్గీయ శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి 30వ వర్ధంతి సభను ఈ నెల 22వ తేదీ నెల్లూరు టౌన్‌హాల్లో నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ నిర్వాహకుడు మైపాడు రాజా ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ హరికథా కథకులు శ్రీ సింహాచల శాస్త్రిచే హరికథా కాలక్షేపం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ప్రముఖ సినీ రచయిత వెన్నెలకంటి, 'లాయర్' వారపత్రిక సంగ్రాహకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి, మురళీకృష్ణ హోటల్స్ ఎండి వీరిశెట్టి హజరత్‌బాబు, వెల్లంచేటి చంద్రమౌళి పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా కొంతమంది ప్రముఖులకు పురస్కారాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని సింహపురి ప్రజలు జయప్రదం చేయాలని కోరారు.

# త్యాగానికి ప్రతీక బక్రీద్

## మసీదులు, ఈద్గాల్లో ముస్లింల సామూహిక ప్రార్ధనలు



త్యాగానికి ప్రతీక బక్రీదని నెల్లూరుజిల్లా కలెక్టర్ ఆర్. ముత్యాలరాజు పేర్కొన్నారు. నెల్లూరులోని బారాషాహిద్ దర్గా ఈద్గాలో ప్రత్యేక ప్రార్ధనల్లో ఆయన పాల్గొన్నారు. ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే రొట్టెల పండుగను గతం కంటే ప్రతి ష్టాత్మకంగా నిర్వహిస్తామన్నారు. దీనికి సంబంధించి ఏర్పాట్లను ముమ్మరం చేస్తామన్నారు.

కాగా, బక్రీద్ పర్వదినాన్ని ముస్లిం సోదరులు మంగళవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నెల్లూరు నగరంలోని వివిధప్రాంతాల్లో ఉన్న మసీదులు, ఈద్గాల వద్ద సామూహిక ప్రార్ధనలు చేశారు. నెల్లూరు దర్గామిట్టలోని బారాషాహిద్ దర్గా ఈద్గా మైదానంలో దర్గా ఈద్గా ఇమామ్ ఖతబ్ సయ్యద్ అబూబకకర్ అష్రఫీ సాబిరి 'ఖుత్బా' సందేశాన్ని అందించారు. శాంతికి పరమత సహనానికి ఇస్లాం చిహ్నమని పేర్కొన్నారు. భారత దేశం ముస్లింలకు అత్యంత గౌరవమైన భూమి అని, దేశ రక్షణ కోసం ముస్లింలు ఎల్లప్పుడూ త్యాగాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

సంతపేట ఈద్గాలో నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్ కుమార్ పాల్గొని ప్రత్యేక ప్రార్ధనలు చేసారు. బక్రీద్ పండుగ త్యాగానికి, ప్రేమకు ప్రతీకని అన్నారు. బర్మాషల్ గుంట ప్రాంతంలోని షంషల్‌హుదా ఈద్గా మైదానంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. మత గురువు ముఫ్తీ ఇలియాజ్ ఉపన్యసించారు. ఈద్గా కమిటి అధ్యక్షుడు షేక్ మహమూద్ పర్యవేక్షించారు. నవాబుపేట నజీర్‌తోటలోని ఈద్గాలో టిడిపి నగర ఇన్‌ఛార్జి ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి పాల్గొని ప్రత్యేక ప్రార్ధనలు చేసి ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. నగర మేయర్ అబ్దుల్ అజీజ్, ఏఎస్పీ శరత్‌బాబు, కమిషనర్ వెంకటేశ్వర్లు, డిఎస్పీ వెంకటరాముడు, నగర కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## ముత్యాలమ్మ ఆదాయం

# రూ. 15.73 లక్షలు

నెల్లూరుజిల్లా చిల్లకూరు మండలం తీరప్రాంతంలోని తూర్పు కనుపూరులో వెలసిన ముత్యాలమ్మ ఆలయ హుండీలోని కానుకలను దేవాదాయ శాఖాధికారుల సమక్షంలో భక్తులు, సిబ్బంది మంగళవారం లెక్కించగా రూ.15,73,683లు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కోవూరు జనార్ధన్‌రెడ్డి తెలిపారు. దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసబాబు, మాజీఛైర్మెన్ సింహాద్రి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## స్కూల్‌గేమ్స్ జిల్లా కార్యదర్శిగా

# కోటేశ్వరమ్మ

పాఠశాలల క్రీడా సమాఖ్య జిల్లా కార్యదర్శిగా నెల్లూరుజిల్లా కోవూరులోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ఎస్ఎ(ఫిజికల్ ఎడ్యుకేషన్) కె.కోటేశ్వరమ్మను డిఇఓ మువ్వా రామలింగం మంగళవారం నియమించారు. సీనియార్టీ ప్రాతిపదికన కోటేశ్వరమ్మను సమాఖ్య కార్యదర్శిగా ఎంపకి చేసినట్లు జిల్లా పిఇటి అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్ కృష్ణారెడ్డి, కె.సనత్‌కుమార్‌లు పేర్కొన్నారు. జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శిగా మహిళ ఎంపిక కావడం ఇదే ప్రథమమని వారు వివరించారు.

## జిఎస్‌టిపై...

# అవగాహన సదస్సు

నెల్లూరు ది ఐరన్ హార్డ్‌వేర్ అండ్ పెయింట్స్ మర్చంట్స్ అసోసియేషన్ అండ్ ఆటోమొబైల్స్ డీలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరులోని సంస్థ కార్యాలయంలో జిఎస్‌టిపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సుకు కోట గురుబ్రహ్మం అధ్యక్షత వహించారు. కొట్టె రామమూర్తి ఆటోమొబైల్ అసోసియేషన్ తరపున నిర్వహణ బాధ్యతలు నిర్వహించారు. ఈ సదస్సుకు ప్రధానవక్తలుగా ఎపి స్టేట్ సేల్స్ టాక్స్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎవిఎస్ కృష్ణమోహన్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ట్రేడ్ ఉపాధ్యక్షులు ఆకుల వెంకటేశ్వర్లు పాల్గొని రానున్న జిఎస్‌టి చట్టాన్ని వ్యాపారులు ఏ విధంగా అమలు చేయాల్సింది, చట్టంలోని నియమ నిబంధనలు గురించి వివరించారు. ప్రభుత్వం మరికొన్ని మార్పులు చేర్పులు చేయనుందని, తుదిరూపం వచ్చిన తర్వాత మరిన్ని అవగాహన సదస్సులు నిర్వహించి చట్టం పట్ల అవగాహన కల్పించి జిఎస్‌టి అమలుకు కృషి చేస్తామని అందరూ సహకరించాలని కోరారు.

# అల్లూరు కోనేరులో గణనాధునికి తెప్పోత్సవం

అల్లూరులో వున్న పెద్ద కోనేరులో బుధవారం రాత్రి శ్రీ విఘ్నేశ్వరుని తెప్పోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యుద్దీపాల కాంతులతో కోనేరు శోభాయమానమైంది. 'ఓం గణనాధా..సిద్ధి వినాయక నమోనమో!' అంటూ పెద్దఎత్తున భక్తులు చేసిన అభయ గణపతి నామస్మరణలతో కోనేరు ప్రాంతమంతా భక్తిభావ సమన్వితమైంది. స్వామివారు కోనేరులో విహరిస్తున్నప్పుడు భారీ బాణసంచా వేడుకలతో అల్లూరు మార్మోగింది. దాదాపు పాతికేళ్ళ విరామం అనంతరం అల్లూరు కోనేరులో ఈ ఉత్సవం జరుగుతుండడంతో భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. పూడికతో నిండిపోయిన ఈ కోనేరును స్వచ్ఛభారత్ సభ్యులు శుభ్రపరచి, సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడంతో ఇక్కడ గణనాధుని ఉత్సవం పున:ప్రారంభమైంది. ఉభయదాతలైన కాటంరెడ్డి వంశీయులు కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ, కోనేరుకు నూతన వైభవాన్ని తెచ్చిపెట్టిన స్వచ్ఛభారత్ కమిటీ సభ్యులను అభినందించి వారిని సత్కరించారు. ఇలాంటి స్వచ్ఛ స్ఫూర్తి ప్రతి గ్రామానికీ అవసరమన్నారు.

# మన స్వాతంత్ర్యవీరులు

(గత వారం తరువాయి)

**ఉద్యమాల పురిటిగడ్డ, పోరాటాల పుట్టినిల్లు మన నెల్లూరు. మొలగొలుకులు మొలచిన జిల్లాగా, మొనగాళ్లకు నెలవైన ఖిల్లాగా ప్రసిద్ధి మన నెల్లూరుజిల్లా. స్వాతంత్ర్య సమరంలో పాల్గొని బ్రిటీష్ ముష్కరులపై తిరుగుబాటు చేసి జైళ్ళపాలైన ఎందరో పోరాటవీరులు మన జిల్లాలో వున్నారు. ఆనాటి సమరంలో పాల్గొన్న ధీరోదాత్తుల వివరాలను పొందుపరుస్తూ గతంలో "హూస్ హూ ఆఫ్ ఫ్రీడమ్ స్ట్రగుల్ ఇన్ ఆంధ్రప్రదేశ్" అన్న పేర రాష్ట్రంలో స్వాతంత్ర్య సమరోద్యమంలో పాల్గొన్న వేలాది మందికి సంబంధించిన సమాచారాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఓ సమగ్ర గ్రంథాన్ని మూడు సంపుటాలుగా ముద్రించింది. వాటిలో మూడవ సంపుటిలో నెల్లూరుజిల్లాకి సంబంధించిన దాదాపు 400మందికి పైగా సమరవీరుల ప్రాథమిక సమాచారాన్ని 'లాయర్' సేకరించగలిగింది. గత నాలుగు వారాల నుండి వారి పేరు, ఊరు వివరాలను 'లాయర్' పాఠకులకు అందిస్తున్నాం.**

**గమనిక :** ఈ మహనీయులకు సంబంధించిన వారి కుటుంబసభ్యులు కాని, లేదా వారి వారసులు గాని... తమ వద్ద క్రింది వారికి సంబంధించిన సమాచారం కాని, వారి ఫోటోలు గాని వుంటే మాకు పంపగలరని మనవి. వీరందరికి సంబంధించిన సమాచారాన్ని సాధ్యమైన వరకు సేకరించి పాఠకులకు, రేపటి తరానికి అందించాలని సాహసిస్తోంది 'లాయర్'. ఆదరించండి, ఆశీర్వదించండి. మీకు తెలిసిన వివరాలను వెంటనే మాకు నేరుగా గాని, లేక ఇ-మెయిల్ roopagroup@yahoo.com ద్వారా గాని పంపవలసినదిగా విజ్ఞప్తి.

మన జిల్లాలోని స్వాతంత్ర్యసమరయోధుల పేరు, ఇంటిపేరు, వూరు, వారి స్వస్థలాలను సూచిస్తూ అప్పటి పాత తాలూకాల్లోని ఆయా వూర్లపేర్లతో అకారాది క్రమం(ఆల్ఫాబెటికల్ ఆర్డర్)లో రూపొందించిన జాబితా ఇది. గమనించగలరు.

| క్ర.సం | పేరు | ఊరు |
|---|---|---|
| 335 | సుబ్బయ్య పసుపులేటి అలియాస్ బెల్లం సుబ్బులు | అల్లూరు కోవూరు తాలూకా |
| 336 | సుబ్బయ్యశెట్టి పెనుబోలు | నెల్లూరు |
| 337 | సుబ్రహ్మణ్యం ఇంద్రగంటి | గోగులపల్లి కోవూరు తాలూకా |
| 338 | సుబ్రహ్మణ్యం సూరిశెట్టి | గోగులపల్లి కోవూరు తాలూకా |
| 339 | సుదర్శనమ్మ తిక్కవరపు | నెల్లూరు |
| 340 | సుందరమ్మ భట్టారం | నెల్లూరు |
| 341 | సుందరరామిరెడ్డి దొడ్ల | మడమనూరు నెల్లూరు తాలూకా |
| 342 | సుందరరామిరెడ్డి ఈదూరు | ముత్తుకూరు నెల్లూరు జిల్లా |
| 343 | సుందరరామిరెడ్డి కోశాన | పార్లపల్లి కోవూరు తాలూకా |
| 344 | సుందరరామిరెడ్డి మునుకూరు | ముసునూరువారిపాళెం నెల్లూరు తాలూకా |
| 345 | సుందరరామిరెడ్డి తుంగా | పెదపుత్తేడు కోవూరు తాలూకా |
| 346 | సుందరరామిరెడ్డి వేమిరెడ్డి | మైపాడు నెల్లూరు తాలూకా |
| 347 | సుందరరామిరెడ్డి ఊడి | కనుపర్తిపాడు నెల్లూరు తాలూకా |
| 348 | సుందరయ్య పుచ్చలపల్లి | అలగానిపాడు కోవూరు తాలూకా |
| 349 | సూర్యప్రకాశరావు సుసర్ల | నెల్లూరు |
| 350 | సయ్యద్ నాగూరు | కావలి తాలూకా |
| 351 | సయ్యద్ ఖాసింసాహెబ్ | కావలి తాలూకా |
| 352 | తాయారమ్మ సుబ్బవరపు | నెల్లూరుజిల్లా |
| 353 | తిరుపాలమ్మ చవనం | గోగులపల్లి కోవూరు తాలూకా |
| 354 | తిరుపతమ్మ | నెల్లూరు |
| 355 | తిమ్మారెడ్డి లెక్కల | కావలి తాలూకా |
| 356 | తిరువేంగడంనాయుడు | వెంకటగిరి |
| 357 | వరదారెడ్డి అత్తివరపు | రాపూరు |
| 358 | వరదారెడ్డి కె | బ్రాహ్మణకాక కావలి తాలూకా |
| 359 | వరదారెడ్డి ఒంటేరు | బ్రాహ్మణకాక కావలి తాలూకా |
| 360 | వరదాశర్మ మిడుతూరు | పల్లిపాడు నెల్లూరు తాలూకా |
| 361 | వెంకారెడ్డి బత్తిన | అల్లూరు కోవూరు తాలూకా |
| 362 | వెంకారెడ్డి కేతిరెడ్డి | కావలి |
| 363 | వెంకారెడ్డి పినకాటి అలియాస్ అంకన్న | గోగులపల్లి కోవూరు తాలూకా |
| 364 | వెంకటాచలంశెట్టి చాట్ల | మనుబోలు నెల్లూరు తాలూకా |
| 365 | వెంకటచలమారెడ్డి కర్పూరం | గంగపట్నం నెల్లూరు తాలూకా |
| 366 | వెంకటకృష్ణారెడ్డి బెజవాడ | బుచ్చిరెడ్డిపాళెం కోవూరు తాలూకా |
| 367 | వెంకటకృష్ణస్వామి చౌదరి కొల్లపనేని | తిరుమలపాడు రాపూరు తాలూకా |
| 368 | వెంకటకృష్ణయ్య శెట్టిపల్లి | నాయుడుపేట సూళ్ళూరుపేట తాలూకా |
| 369 | వెంకటకృష్ణయ్యశెట్టి చిరువెళ్ళ | వెంకటగిరి |
| 370 | వెంకటనరసారెడ్డి ఏనుగ | గూడూరు |
| 371 | వెంకటనరుసు కత్తి అలియాస్ వెంకటయ్య | గోగులపల్లి కోవూరు తాలూకా |
| 372 | వెంకటనారాయణరెడ్డి బద్దిపూడి | కోటపోలూరు సూళ్ళూరుపేట తాలూకా |
| 373 | వెంకటపతిరెడ్డి అన్నంరెడ్డి | మడమనూరు నెల్లూరు తాలూకా |
| 374 | వెంకటప్పయ్య పోలా | వెంకటగిరి |
| 375 | వెంకటరాఘవయ్య చతుర్వేదుల | పల్లిపాడు నెల్లూరు తాలూకా |
| 376 | వెంకటరామానాయుడు నెల్లూరు | నెల్లూరుజిల్లా |

(మిగతా 11వ పేజీలో)



## ఆధ్యాత్మిక పండుగగా...
# టిఎస్సార్ జన్మదిన వేడుకలు

- 16న పుట్టినరోజు సంబరాలు
- 17న మోహన్‌బాబుకు 'నవరస నటతిలకం' బిరుదు ప్రదానం



*ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, రాజ్యసభ సభ్యుడు టి. సుబ్బరామిరెడ్డి ఈసారి తన జన్మదినోత్సవ వేడుకలను మరింత ఉత్సాహంగా.. ఒక ఆధ్మాత్మిక పండుగగా జరుపుకోనున్నారు. దేశంలోని పలు విఖ్యాత ఆలయాల నుంచి అర్చకస్వాములను, ప్రముఖ పీఠాధిపతులను ఆహ్వానించి ఎంతో వైభవంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సినీహీరో డా. మోహన్‌బాబును విశిష్టమైన 'నవరస నటతిలకం' బిరుదుతో ఘనంగా సత్కరించనున్నారు.*

ఈ నెల 16వ తేదిన విశాఖపట్టణంలోని కళాభారతి ఆడిటోరియంలో టిఎస్సార్ జన్మదిన సంబరాలు ఘనంగా జరగనున్నాయి. ఈ కార్యక్రమానికి విశాఖపట్టణంలోని శ్రీ శారదా పీఠాధిపతి శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి మహరాజ్ స్వామీజీ ముఖ్యఅతిథిగా విచ్చేయనున్నారు. పశ్చిమగోదావరి ముక్కామల క్షేత్రం శ్రీ యజ్ఞపురాధీశ్వరి పీఠాధిపతి పరమపూజ్య శ్రీ శ్రీధరస్వామీజీ, అభినవ పతంజలి పండిట్ శేషభట్టర్ సుదర్శనాచార్య, ప్రముఖ సినీహీరో ఎం. మోహన్‌బాబు, విశాఖ జిల్లా జడ్జి వి. జయసూర్య, బాలబంధు డా. ఎం.కె రాము, ప్రముఖ పారిశ్రామికవేత్త డా. సూరపనేని విజయ్‌కుమార్, ఆధ్యాత్మికవేత్త మెట్టుపల్లి చలమయ్య, ఆగమ విశారద బ్రహ్మశ్రీ కృష్ణశర్మలతో పాటు, దేశంలోని పలువురు ప్రముఖులు, సినీరంగ ప్రముఖులు విచ్చేయనున్నారు.

టిఎస్సార్ జన్మదినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఈ నెల 17న విశాఖపట్టణంలోని ఇందిరాప్రియదర్శిని ఆడిటోరియంలో టి.సుబ్బరామిరెడ్డి లలిత కళాపరిషత్ ఆధ్వర్యంలో ఎంతో ఘనంగా జరిగే కార్యక్రమంలో ప్రఖ్యాత సినీ హీరో డా.ఎం. మోహన్‌బాబు తన సినీరంగ ప్రస్థానం నాలుగు దశాబ్దాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయనకు ప్రతిష్టాత్మకమైన 'నవరస నటతిలకం' బిరుదును ప్రదానం చేయనున్నారు. టిఎస్సార్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి రాజ్యసభ డిప్యూటి ఛైర్మెన్ పి.జె కురియన్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులకు కూడా విశిష్ట సత్కారాలు నిర్వహించనున్నారు. ప్రముఖ సినీనటులు చిరంజీవి, నాగార్జున, వెంకటేష్, బ్రహ్మానందం, ప్రముఖ సినీదర్శకుడు రాఘవేంద్రరావు, నటీమణులు శ్రీదేవి, జయప్రద తదితరులంతా ఈ వేడుకల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ఎంతో విశిష్టమైన రీతిలో జరిగే 'సర్వధర్మ సంభావన సమ్మేళనం'లో వివిధ మతాలకు చెందిన ప్రముఖులు పాల్గొంటారు. ఎంతో వేడుకగా జన్మదినోత్సవాన్ని జరుపుకోనున్న మన సుబ్బరామన్నకు..'లాయర్' హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు.



గణేష్ నిమజ్జనోత్సవాల సందర్భంగా నెల్లూరులోని శివాజీ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుడి వద్ద పూజలు నిర్వహిస్తున్న స్వర్ణభారత్ మేనేజింగ్ ట్రస్టీ ఐ.దీపావెంకట్, పక్కన బీజేపీ నాయకులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

# హార్వర్డ్ యూనివర్శిటీతో నారాయణ ఒప్పందం



అంతర్జాతీయ స్థాయిలో వైద్యసేవలు అందించడంలో ప్రసిద్ధిగాంచిన అమెరికన్ హార్వర్డ్ యూనివర్శిటీ నెల్లూరులోని నారాయణ మెడికల్ కాలేజీతో వైద్యసేవలకు సంబంధించి ఒక ఒప్పందం కుదుర్చుకోనుంది. ఈమేరకు హార్వర్డ్ యూనివర్శిటీకి చెందిన నిపుణుల బృందం ఈ నెల 14వ తేదీన నారాయణ మెడికల్ కాలేజీని సందర్శించింది. నారాయణ మెడికల్ కాలేజీలో వైద్యవిద్యా బోధన చక్కటి ప్రణాళికతో పరిశోధనాత్మకంగా ఉండడం, కళాశాలకు అనుబంధంగా ఉన్న హాస్పిటల్‌లో నిష్ణాతులైన వైద్య బృందం, ఆధునిక వైద్య పరికరాలు, వైద్య విద్యార్థులకు అవసరమైన క్లినికల్ మెటీరియల్, అడ్వాన్స్ రీసెర్చ్ సెంటర్ మొదలగునవి ఈ బృందానికి సంతృప్తినిచ్చాయి. ఈమేరకు నారాయణ మెడికల్ కాలేజీని వైద్యవిద్య, ఆధునిక సౌకర్యాలు, సాంకేతిక నైపుణ్యం, మౌలిక వసతులు, పరిశోధనా వంటి విభాగాల్లో హార్వర్డ్ విశ్వవిద్యాలయం స్థాయికి తీర్చిదిద్దే విధంగా నారాయణ కాలేజీతో అవగాహనా ఒప్పందం కుదుర్చుకోనుంది. హార్వర్డ్ యూనివర్శిటీతో దక్షిణ భారతదేశంలో ఇలాంటి ఒప్పందం చేసుకున్న మొట్టమొదటి కాలేజీ నారాయణ మెడికల్ కాలేజీ కావడం విశేషం! నెల్లూరు ఒక ప్రాంతీయ వైద్యకేంద్రం అయ్యేందుకు ఈ ఒప్పందం ఎంతో దోహదపడుతుందని ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో నారాయణ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా॥ జి.వీరనాగిరెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో నారాయణ మెడికల్ గ్రూప్ కో-ఆర్డినేటర్ డా॥ సర్వేపల్లి అజయ్ కుమార్, అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డా॥। శ్రీరాంసతీష్, సిఇఓ డా॥ సి.విజయమోహన్‌రెడ్డి, అడ్మినిస్ట్రేటర్ డా॥ కె.ఎస్.వి.కె.సుబ్బారావు, ఏజిఎం భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కీలకం... కంప్యూటర్ ఆపరేటర్లే!



- **40మంది బదిలీ!**

జిల్లాలోని ఆయా మండల రెవెన్యూ కార్యాలయాల్లో పనిచేస్తున్న 40మంది కంప్యూటర్ ఆపరేటర్లను బదిలీ చేశారు. డివిజన్ల వారీగా ఆపరేటర్లను అటూ ఇటూ మార్చారు. ఇటీవల కాలంలో కంప్యూటర్ ఆపరేటర్లపై ఆరోపణలు వెల్లువెత్తాయి. ముఖ్యంగా వెబ్‌ల్యాండ్‌లో ఆపరేటర్లదే ఇష్టారాజ్యమైంది. పలువురు తహశీల్దార్లకు కూడా కంప్యూటర్ పరిజ్ఞానం అంతగా లేకపోవడంతో వీళ్ల మీదే ఆధారపడేవాళ్లు. మండల కేంద్రాలలో వీళ్లు చాలా కాలంగా పాతుకుపోవడం, ఆ మండలాలలో ప్రభుత్వ, అసైన్డ్, డికెటి, సిజెఎఫ్‌ఎస్ భూముల వివరాలు పూర్తిగా తెలిసివుండడంతో అక్రమాలకు తెరలేపారు. వెబ్‌ల్యాండ్‌లో తప్పుడు వివరాలు ఎక్కించి డబ్బులు వసూలు చేసిన వాళ్లు కూడా వున్నారు. రెవెన్యూ అధికారులు, కంప్యూటర్ ఆపరేటర్లు కుమ్మక్కై ప్రభుత్వ భూముల్లో అక్రమాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో కలెక్టర్ వారి బదిలీలకు శ్రీకారం చుట్టారు.

# డీసీసీబీలో ఏటిఎం సేవలు
## ప్రారంభించిన బ్యాంక్ ఛైర్మెన్ మెట్టుకూరు



నెల్లూరులోని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఆవరణలో ఏర్పాటు చేసిన తొలి ఏటిఎంను ఈ నెల 9వ తేదీన ఆ బ్యాంకు ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి ప్రారంభించారు. వాణిజ్య బ్యాంకులకు ధీటుగా ఖాతాదారులకు సేవలు అందించడమే తమ లక్ష్యమని ఈ సందర్భంగా ధనుంజయరెడ్డి చెప్పారు. జిల్లాలో 10 ఏటిఎంలను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. బ్యాంకు పరిధిలోని సొసైటీలకు కూడా త్వరలో మైక్రో ఏటిఎంలను అందుబాటులోకి తెస్తామన్నారు. ఈ సీజన్‌లో రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించేందుకు సొసైటీల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిఇఓ రాజా రెడ్డి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు...
# అందరూ భాగస్వాములు కావాలి



పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కాలుష్య రహిత గణనాథులను పూజించి భావితరాల మనుగడకు ప్రాణం పోయాలని చందన సిఎంఆర్ అధినేత మావూరి శ్రీనివాసరావు, రాజీయాడ్స్ అధినేత మోపూరు పెంచలయ్య అన్నారు. వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు నిర్వహించిన కాలుష్యరహిత విఘ్ననాధుల ప్రతిమల పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి మంగళవారం నెల్లూరు కనకమహల్ సెంటర్‌లోని చందన సిఎంఆర్ షాపింగ్‌మాల్‌లో ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెల్లూరు నగర స్థాయిలో ఈ పోటీల్లో వివిధ విద్యాసంస్థల నుంచి 88మంది పోటీపడ్డారని, వీరిలో అత్యుత్తమ గణపతి ప్రతిమలు రూపొందించిన ముగ్గురికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, మరో ముగ్గురికి ప్రత్యేక కన్సొలేషన్ బహుమతులు, మరో 15మందికి కన్సొలేషన్ బహుమతులు అందజేసినట్లు తెలిపారు.

విఘ్నాధిపతిని విత్తనాలతో తీర్చిదిద్దిన కలివెలపాళెం రెయిన్‌బో స్కూల్ విద్యార్థి ప్రథమ స్థానాన్ని, మట్టితో తీర్చిదిద్దిన నెల్లూరుకు చెందిన ఎం.ప్రత్యూష ద్వితీయ స్థానాన్ని పంచదారతో తీర్చిదిద్దిన నెల్లూరు నారాయణ టెక్నో స్కూల్‌కు చెందిన విద్యార్థి ఎస్.పి.నిఖిలచౌదరి తృతీయ స్థానాన్ని సాధించారని తెలిపారు.

## 'ప్రభా'తం

# జలాలతో జగడాలా?

జలాల జగడాలతో కర్నాటక-తమిళనాడు రాష్ట్రాలు ఇటీవల అట్టుడికి పోయాయి. హింసాత్మక సంఘటనలతో ఉద్రిక్తంగా మారాయి. శాస్త్రజ్ఞానం శరవేగంతో విస్తరిస్తున్న ఈదశలో కూడా నీటికోసం కొట్లాటలా?.. ప్రకృతి వరప్రసాదమైన జీవజలాలను జగడాలమయం కాకుండా చూసుకోలేక పోవడం ఎంత బాధాకరం!.. నదీజలాలను సక్రమంగా పంపిణీ చేసుకునేందుకు, వివాదాలు లేకుండా చూసేందుకు జాతీయస్థాయిలో ఒక సుదృఢమైన జలవ్యవస్థకు ఇకనైనా కేంద్రం శ్రీకారం చుట్టాల్సివుంది.

కావేరి జలాల వివాదం రెండు రాష్ట్రాలను కుదిపేస్తోంది. ఆ వివాదం ఇటీవల తమిళనాడు-కర్నాటకల్లో పలు హింసాత్మక సంఘటనలకు దారి తీసింది. కర్నాటకలో పలు బస్సులు లారీలు దగ్ధమయ్యాయి. తమిళనాడులో ఆగ్రహావేశాలు, నిరసనలు, అందోళనలు, విధ్వంస ఘటనలు జరిగాయి. రెండు రాష్ట్రాల్లోనూ ఆందోళనకారులు పరస్పర దాడులకు పూనుకున్నారు. పలు బస్సులు, లారీలు, వాహనాలు దగ్ధమయ్యాయి. బెంగుళూరులో పలు ప్రాంతాల్లో ఉద్రిక్తతలు చెలరేగడంతో కర్ఫ్యూ విధించారు. దిగ్గజాల వంటి ప్రపంచఖ్యాతి పొందిన అనేక కంపెనీలు, సంస్థలు వున్న బెంగుళూరు నగరం విధ్వంసాలతో బెంబేలెత్తిపోయింది. కావేరి నదినుంచి తమిళనాడుకు నీటిని ఇవ్వాల్సిందేనని సుప్రీంకోర్టు మానవీయ ధర్మంతో కర్నాటకకు స్పష్టం చేసింది. విడుదల చేయాల్సిన నీటి పరిమాణాన్ని 15 నుంచి 12 వేల క్యూసెక్కులకు తగ్గించింది కూడా. సెప్టెంబర్ 20వ తేది వరకూ ఆ మేరకు నీటిని విడుదల చేయాలని ఆదేశించింది. సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను పాటించడం రెండు రాష్ట్రాల కర్తవ్యం. అయితే ఆ ఆదేశాల మేరకు నీటి విడుదలను వ్యతిరేకిస్తూ కర్నాటకలో ఆందోళనలు మిన్నంటాయి. కావేరి నీటిని ఆమేరకు తమిళనాడుకు విడుదల చేస్తే కర్నాటక ప్రజలకు నీటికొరత తీవ్రమవుతుందని కర్నాటక రైతునేతల వాదన. ఏదేమైతేనేం, కావేరి జలాల జగడం రెండు రాష్ట్రాల్లో ఉద్రిక్తతలు రేపింది. నిజానికి ఈ జలాల జగడం ఇవాళ కొత్తదేమీ కాదు.. ఏళ్ళ తరబడిగా ఆ సమస్య అపరిష్కృతంగానే వుంది. నీటికొరత ఏర్పడినప్పుడల్లా పునరావృతమవుతూనే వుంది. ఈ సమస్య ఎప్పటికి పరిష్కారమవుతుందో అనూహ్యం. రెండు రాష్ట్రాల వారికి కావేరి జలాల కేటాయింపుల విషయంలో ఎవరి భావోద్వేగాలు వారికి వున్నాయి. అయినా, ఆ జలాల కేటాయింపుల్లోను, తమిళనాడుకు ఇచ్చే వాటాల్లోనూ ఏవైనా విభేదాలు, వివాదాలు వుంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, నిపుణులు అందరూ సమావేశమై సమస్యను సామరస్యంగా పరిష్కరించుకునేందుకు ప్రయత్నించకపోవడం విచారకరం. జలాల జగడాలతో తాజాగా జరిగిన హింసాత్మక ఘటనలు మాత్రం దారుణం. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు నష్టం కలగడం, ఆ నష్టం కూడా వేల కోట్ల రూపాయల్లో భారీగా వుండడం ఎంతో బాధాకరం! తమిళనాడుకు నీటిని విడుదల చేస్తే కర్నాటకకు తాగునీరు వుండదంటూ మంత్రులు, ముఖ్యమంత్రి మొన్నటి దాకా ప్రకటనలు చేస్తూనేవున్నా, జలాల చిచ్చు రగిలేదాకా కేంద్రం ఆ సమస్యను పట్టించుకోక నిమ్మకు నీరెత్తి వుండడం విమర్శలకు దారితీస్తోంది. ఈ ఘర్షణలతో రెండు రాష్ట్రాల్లోనూ సామాన్య ప్రజలే ఎక్కువగా ఇబ్బందిపడ్డారు. హింసాత్మక ఘటనల నేపథ్యంలో బెంగుళూరులోని పలు ప్రతిష్టాత్మకమైన ఐటి సంస్థలు మూతపడ్డాయి. అనేక ప్రాంతాల్లో రవాణా సదుపాయాలు స్తంభించపోయాయి. ప్రజాజీవనం అస్తవ్యస్తమైంది. రోజువారీ కార్మికులు, సాధారణ పేద ప్రజలు, కార్మికులు, ఉద్యోగులు విధులకు, పనులకు వెళ్లలేక జీవనోపాధికి ఎంతో ఇబ్బందులు పడ్డారు. దీంతో, రెండు రాష్ట్రాల్లోని రాజకీయపార్టీల అస్తవ్యస్త విధానాల వల్లనే ఇదంతా జరిగిందనే విమర్శలూ వ్యక్తమవుతున్నాయి. కేంద్రంలో అధికారంలో వున్న బిజెపి, కర్నాటకలో తిరిగి అధికారంలోకి రావాలనే ఉద్దేశంతో వుందని, కాంగ్రెస్-బిజెపి ఆధిపత్య రాజకీయాలు కూడా ఈ సమస్య మరింత జటిలం కావడానికి మరో కారణమనే విమర్శలూ లేకపోలేదు. మరోవైపు, అదనుకోసం వేచిచూస్తున్న అసాంఘిక శక్తులకు ఈ వివాదం ఊతంలా దొరికినట్లయిందని, అందివచ్చిన అవకాశాన్ని వాడుకుంటూ ఆ శక్తులు హింసాత్మక ఘటనలకు పాల్పడడం వల్లనే ఇంత భారీ విధ్వంసాలు, నష్టాలు వాటిల్లాయనే అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి.

ఏదేమైనా, దేశంలో ఐటి పరిశ్రమలకు కేంద్రంలా వున్న బెంగుళూరు నగరంలో ఈ విధ్వంసాల వల్ల దేశవిదేశాల పరిశ్రమలవారు ఇక్కడ కొనసాగాలా వద్దా అనే సంశయంలో పడితే మరింత నష్టమని ప్రజలు వాపోతున్నారు. ఈ కారణంతోనైనా ఆందోళన కారులు సంయమనం పాటించకపోవడం బాధాకరం. అసలు నదీజలాల సమస్య ఈ రెండు రాష్ట్రాలకే కాదు, దేశంలో అనేకచోట్ల వున్నవే. నీటి కొరత వున్నప్పుడల్లా ఆగ్రహంతో ఈ వివాదాలు సుడులు తిరుగుతూనే వుంటాయి. అయినా, శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఎన్నో విజయాలతో ముందుకు దూసుకు వెళ్తున్న మనదేశంలో ఇంకా నీటికోసం కొట్లాటలా?.. ఎంత అప్రదిష్ట!..ఇకనైనా ఈ జలవివాదాలకు శాశ్వత ప్రాతిపదికన పరిష్కారానికి నేతలు, మేధావులు సమాయత్తం కావాలి. జాతీయస్థాయిలో ఒక సుదృఢమైన జాతీయ జలసంఘాన్ని ఏర్పరచుకోవాలి. నీటిబొట్లు ప్రజలకు కన్నీటిబొట్లు కాకుండా, అంతర్రాష్ట్ర నదీజలాలను అందరికీ అమోదయోగ్యమైన రీతిలో ఎలా పంపిణీ చేసుకోవాలో నిర్ణయించి నిర్దేశించే నూతన జలవ్యవస్థకు శ్రీకారం చుట్టుకోవాలి. ప్రతి నీటిబొట్టును ఒడిసిపట్టుకుని దేశాన్ని సస్యశ్యామలం చేసుకోవాల్సిన దశలో, ఇంకా లేనిపోని నీటి వివాదాలతో ఉన్న ఆస్తులకు అగ్గిపెట్టుకోవడం వల్ల జరిగే..ఒరిగే ప్రయోజనమేమీ వుండదు. ఒక్కసారి మంచి వానలొస్తే చాలు..ఆ నీటికష్టాలన్నీ ఎటుపోతాయో!..అందాకా సంయమనం అవసరం.

వారినీ-వీరినే కాదు.. ఎవరి ప్రాణాలనైనా నిలబెట్టేది ఆ నీరే. ప్రకృతి ప్రసాదించిన జలమే అందరికీ ప్రాణాధారమన్నది అందరికీ తెలిసిందే. కనుక, మనమంతా ఆ జీవజలాలను ప్రకృతిమాత వరప్రసాదంగా భావించాలి. పవిత్రమైన ఆ జలాలను జగడాలమయం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదీ. అందుకే, అరమరికలు లేకుండా..మానవతా దృక్పథంతో అందరూ కలిసిమెలిసి చర్చించుకోవడమే ఉత్తమం. జల వివాదాలకే కాదు. ఎలాంటి వివాదాలకైనా సరే.. శాశ్వత పరిష్కారానికి సయోధ్యే మంచి మార్గం!

## నేత్రపర్వంగా.. జైనుల శోభాయాత్ర



బాబారాందేవ్ జయంతి సందర్భంగా సోమవారం నెల్లూరులో జైనులు నిర్వహించిన శోభాయాత్ర నేత్రపర్వంగా సాగింది. బాబా రాందేవ్ విగ్రహాన్ని వివిధ పుష్పాలతో విశేషంగా అలంకరించి రథంపై కొలువుదీర్చారు. అనంతరం ట్రంకు రోడ్డు, కాపువీధి నుంచి గాంధీబొమ్మ, రాయాజీవీధి, చిన్నబజారు, పెద్దబజారు, మండపాల వీధి మీదుగా కాపువీధిలోని బాబా రాందేవ్ మందిరం వరకు శోభాయాత్ర సాగింది. జత్‌సింగ్ రాజ్‌పురోహిత్, రాజ్‌పురోహిత్ యువమండల్, రాజ్‌పురోహిత్ జెతేశ్వర్ సేవాసమాజ్, నాయక్ మండల్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ శోభాయాత్రలో జైనులు నృత్యాలతో అలరించారు.

## సంగం షఫీ తొలగింపు

నెల్లూరుజిల్లా కాంగ్రెస్ కమిటి మైనార్టీ విభాగ అధ్యక్షుడు షేక్ షఫీ అహ్మద్ (సంగం షఫీ)ని ఆ పదవి నుంచి తొలగిస్తూ ఎపిసిసి మైనార్టీ విభాగ ఛైర్మెన్ అహ్మద్ అలీఖాన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్.కె.షఫీ అహ్మద్ (సంగం షఫీ) మైనార్టీ విభాగానికి, కాంగ్రెస్‌పార్టీకి సరిగ్గా పని చేయనందువల్ల ఆ పదవి నుంచి తొలగిస్తున్నట్లు దానిలో పేర్కొన్నారు.

# కేసుల సత్వర పరిష్కారానికి లోక్‌అదాలత్

కేసుల సత్వర పరిష్కారానికి లోక్‌అదాలత్ దోహదపడుతుందని, అంతేకాకుండా కక్షిదారులకు సమయంతో పాటు ఖర్చు తగ్గుతుందని నెల్లూరుజిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మెన్ మౌలానా జునైద్ అహ్మద్ అన్నారు. 10వ తేదీ నెల్లూరులోని జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయసేవాసదన్ భవనంలో జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కక్షిదారులు కేసులను రాజీ చేసుకోవడం ద్వారా శాశ్వత పరిష్కారం జరుగుతుందన్నారు.

***926 కేసుల పరిష్కారం:***

జాతీయ లోక్‌అదాలత్ సందర్భంగా జిల్లా కోర్టు ఆవరణంలో 7 బెంచీలను ఏర్పాటు చేశారు. అదనపు జిల్లా జడ్జీలు పాపిరెడ్డి, శ్రీరామచంద్రమూర్తి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సత్యవాణి, మొదటి అదనపు సీనియర్ సివిల్ జడ్జి భూపాల్‌రెడ్డి, జూనియర్ సివిల్ జడ్జీలు శోభారాణి, కేశవ, వాసుదేవన్‌లు ప్రిసైడింగ్ అధికారులుగా వ్యవహరించి 926 కేసులను పరిష్కరించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ కోర్టుల్లో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 490 కేసులను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి శ్యామలాదేవి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్‌జడ్జి సుబ్బారావు, జూనియర్ సివిల్ జడ్జీలు హేమలత, పద్మ, అరుణశ్రీ, పద్మశ్రీ, బ్యాంక్, ఇన్సూరెన్స్ అధికారులు పాల్గొన్నారు.

## మోడీ రంగు బయటపడింది

ఇంతకాలం ప్రధాని నరేంద్ర మోడీని ఒక వైపే చూసాం. ఆంధ్రాకు ప్రత్యేకహోదా లేదన్నాక ఆయన రెండో కోణాన్ని చూస్తున్నాం. విభజన సమయంలో ఆయన ఆంధ్రుల పట్ల ఎంతగా మొసలికన్నీళ్లు కార్చారు. యూపిఏ ప్రభుత్వం ఆంధ్రాకు అన్యాయం చేస్తుందంటూ ఎంతగా బాధపడిపోయారు. తాము అధికారంలోకి రాగానే రాష్ట్రానికి ప్రత్యేకహోదా కల్పించి ఆదుకుంటామన్నారు. నరేంద్ర మోడీ నిజాయితీ మీదున్న నమ్మకంతో ప్రజలు ఆయన మాట మీద నిలబడతాడని నమ్మారు. కాని ఏపిని ఇంత పచ్చిగా వంచిస్తారని ప్రజలు ఊహించ లేదు. మోడీ పట్ల ప్రజలు పెంచుకున్న భ్రమలన్నీ తొలగిపోయాయి. వీళ్లకంటే యూపిఏ వాళ్లే నయం. కనీసం వాళ్లు మిమ్మల్ని చంపుతున్నామని ముందుగానే చెప్పి చంపారు. బీజేపీవాళ్లు మిమ్మల్ని కాపాడుతామని చెప్పి మరీ చంపారు. ఇప్పుడు మోడీకి మన్మోహన్‌సింగ్‌కు ఏ తేడా కనిపించడం లేదు.

**– కొండేటి వెంకటేశ్వర్లు, నాయుడుపేట.**




## ఆక్రమణలు తొలగించాలి

విడవలూరులో ఎన్‌టిఆర్ రోడ్డుకిరువైపులా ఆక్రమణలు తొలగించాలి. పీర్లచావిడి వద్ద ఆక్రమణలు తొలగించాలి. ఇక్కడ ఫుట్‌పాత్‌లు, సన్‌సైడ్‌లతో రోడ్డు ఇరుకుగా మారి లారీలు, బస్సులు వెళ్లాలంటే ఇబ్బందిగా వుంది. పంచాయితీ కాలువల మీద సిమెంట్ బండలు పోసి డ్రైనేజీ మురుగునీరు పోకుండా చేస్తున్నారు.

**పాశం రవీంద్రరెడ్డి, విడవలూరు.**

## సమర్థ అధికారి రాఘవరావు

ఇటీవల జరిగిన కృష్ణ పుష్కరాలకు విధుల నిమిత్తం ప్రభుత్వంచే నియమించబడి తనకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించి పుష్కర యాత్రికులు, అధికారుల చేత ప్రశంసలు పొందిన కావలి డిఎస్పీ యస్.రాఘవరావు అభినందనీయులు. తాను విధుల నిమిత్తం పుష్కరాలకు వెళ్లినప్పటికి కావలి పోలీసు సబ్‌డివిజన్ పరిధిలో నిరంతరం శాంతిభద్రతలను పర్యవేక్షిస్తూ డివిజన్‌లోని ప్రజలకు ప్రశాంత పరిస్థితి అందించారు. కావలి డిఎస్పీగా వచ్చిన నాటి నుండి పేద ప్రజలకు సత్వర న్యాయం అందిస్తూ వారికి మేలు చేస్తున్నారు. సమర్థ అధికారిగా పేరు తెచ్చుకున్నారు. కావలి పోలీసు సబ్‌డివిజన్ పరిధిలో మంచి అధికారిగా సేవలందిస్తున్నారు.

**యస్.బాబురావు, కావలి.**

## ప్యాకేజీపై ప్రేమ

చంద్రబాబు ప్రత్యేక ప్యాకేజీపై వున్న అభిమానంతో ప్రత్యేకహోదాకు సమాధి కట్టారు. ప్రత్యేకహోదా వస్తే ప్రజలు బాగుపడతారు. ఆయనకు కావాల్సింది అది కాదు కదా! ప్యాకేజీ వస్తే తెలుగుతమ్ముళ్లు లబ్ది పొందుతారు. వచ్చే ఎన్నికల్లో ఓట్ల కొనుగోలు శక్తి పెరుగుతుంది. ఈ ఆలోచనతోనే ప్యాకేజీ వైపు మొగ్గుచూపినట్లుగా వుంది. మరోవైపు వెంకయ్యనాయుడు కూడా తన ఉపరాష్ట్రపతి పదవి కోసం కేంద్రానికి మద్దత్తు పలకడం ఆంధ్రా ప్రజలను మోసం చేయడమే!

**గువ్వల కొండారెడ్డి, నెల్లూరు.**

## తూచ్... స్టేట్‌మెంట్ తప్పాడు!



- సాక్ష్యం తారుమారైంది
- న్యాయం తలక్రిందులైంది

2014లో నెల్లూరుజిల్లా పరిషత్ ఛైర్మెన్ ఎన్నిక సందర్భంగా పెద్ద డ్రామా జరగడం తెలిసిందే! ఆరోజు మెజార్టీ జడ్పీటీసీలను వైయస్సార్ కాంగ్రెస్ గెలుచుకుంది. పద్ధతి ప్రకారం ఎన్నిక జరిగితే ఎలాంటి సందేహాలు లేకుండా వైకాపా అభ్యర్థే ఛైర్మెన్ కావాలి. కాని అప్పుడే తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో నెల్లూరు జడ్పీ సీటును ఎత్తుకెళ్లాలని తెలుగుదేశంవాళ్లు సిద్ధపడ్డారు. అయితే మొదటిసారి జడ్పీ హాలులో ఎన్నికలు నిర్వహించాలనుకున్న సమయానికి తెలుగుదేశం వాళ్లు వైకాపా నుండి తగినంత జడ్పీటీసీలను లాగలేకపోయారు. దీంతో ఆరోజు ఎన్నికను ఎలాగైనా వాయిదా వేయించాలని కంకణం కట్టుకుని తెలుగుదేశంవాళ్లు సమావేశంలో గందరగోళం సృష్టించారు. ముఖ్యంగా ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, మరికొందరు జడ్పీటీసీలు కలెక్టర్‌గా వున్న శ్రీకాంత్ టేబుల్ వద్దకు వెళ్లి నానా రభస సృష్టించారు. వాళ్ల రభస వల్లే ఆరోజు ఎన్నికను వాయిదా వేశారు. ఆనాటి సంఘటన దృశ్యాలు మీడియాలో కూడా ప్రసారమయ్యాయి. కలెక్టర్ పట్ల దురుసుగా వ్యవహరించిన వారిపై వన్‌టౌన్‌లో కేసు నమోదైంది. ఈ కేసు ఇటీవల విచారణ కొచ్చింది. శ్రీకాంత్ ఇక్కడ కలెక్టర్‌గా చేసిన తర్వాత సిఆర్‌డిఏ కమిషనర్‌గా వెళ్లి, అక్కడ నుండి రాజకీయ వ్యవహారాలకు బదిలీ అయ్యారు. ఈ కేసు విచారణకొచ్చిన ఆయన ఆరోజు జరిగిన దానిపై మాట మార్చినట్లు తెలిసింది. ఈరోజు తన ముందు గలభా సృష్టించిందెవరో పక్కాగా తెలిసినా కూడా... కోర్టులో మాత్రం ఎమ్మెల్యేతో పాటు ఎవరెవరో వచ్చారని, ఆ తర్వాత ఏం జరిగిందో తనకు తెలియదని చెప్పాడని సమాచారం. న్యాయాన్ని కాపాడాల్సిన వాళ్లే ఇంత అన్యాయంగా తయారవ్వబట్టేనేమో... న్యాయదేవత కళ్లకు ఎప్పుడూ గంతలు కట్టి ఉండేది!

## ఆశలు ఆవిరి




- హోదా హుళక్కే... నెల్లూరీయుల్లో నిరాశ!

ప్రత్యేకహోదా... రాష్ట్రంలో ఇదే ప్రధాన చర్చ. ప్రత్యేకహోదా వల్ల ఉపయోగాలేంటన్నది అందరికీ పూర్తిగా తెలియకపోయినా, అందరూ మాత్రం రాష్ట్రానికి ప్రత్యేకహోదా వస్తే బాగుండను కున్నారు. మరీ ముఖ్యంగా నెల్లూరుజిల్లాలో అయితే ప్రత్యేకహోదాపై భారీగా ఆశలు పెట్టుకున్నారు. ప్రత్యేకప్యాకేజీల వల్ల ఎవరికీ ఏమీ ఒరిగేది ఉండదు. పారిశ్రామిక అభివృద్ధికి ప్యాకేజీ వల్ల ఉపయోగం ఉండదు.

ప్రత్యేకహోదా వస్తే పారిశ్రామిక ప్రగతి ఉంటుందన్నది ప్రజల ప్రగాఢ నమ్మకం. అదికూడా హోదా వస్తే నెల్లూరుజిల్లాకు ఎక్కువ ప్రయోజనం కలిగే అవకాశాలున్నాయి. ఈరోజు ఏపిలో పరిశ్రమల స్థాపనకు అన్ని విధాలా అనువైనది నెల్లూరుజిల్లానే! జిల్లాలో కృష్ణపట్నం పోర్టు వుంది. కృష్ణపట్నం, శ్రీసిటీ, మేనకూరు, అపాచీ, ఇఫ్కో సెజ్‌లు వున్నాయి. తగినంత విద్యుత్ ఉత్పాదన, నీటి వనరులు, మానవ వనరులు, రవాణా... అన్నీ అందుబాటులో వున్నాయి. చెన్నై సిటీ దగ్గర్లో వుంది. చెన్నై, తిరుపతి ఎయిర్‌పోర్టులు దగ్గర్లో ఉన్నాయి. శ్రీసిటీ, కృష్ణపట్నం సెజ్‌లలో ఇప్పటికే పెద్దఎత్తున పరిశ్రమలు వచ్చాయి. ఏపికి ప్రత్యేకహోదాను ప్రకటిస్తే మరికొన్ని కంపెనీలు ఇక్కడ పరిశ్రమలను స్థాపించేందుకు సిద్ధంగా ఉన్నాయి కూడా! ముఖ్యంగా ప్రత్యేకహోదా ఇచ్చుంటే కొన్ని కంపెనీలు తమిళనాడులోని తమ పరిశ్రమలను నెల్లూరుజిల్లా, చిత్తూరుజిల్లాలకు తరలించడానికి సిద్ధపడ్డాయి కూడా! పరిశ్రమలు వచ్చుంటే కృష్ణపట్నం పోర్టులో కూడా బెర్త్‌లను పెంచాల్సి ఉండేది. ప్రత్యేక హోదా వచ్చుంటే పారిశ్రామిక ప్రగతిలో కదలిక వచ్చేది. దాని మూలంగా భూలావాదేవీలు మొదలైవుండేవి. రియల్ ఎస్టేట్‌లో ఊపొచ్చేది. భూములు కొని అమ్ముడుపోక, తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక నానా అగచాట్లు పడుతున్న రియల్టర్లు కొంతన్నా తేరుకునేవాళ్లు. రియల్ ఎస్టేట్ కదిలి వుంటే అన్ని వ్యాపారాలపై ప్రభావం పడి ఆర్థికంగా జిల్లాలో కొంత ఉత్సాహవంతమైన వాతావరణం వచ్చేది. కాని ఇప్పుడు హోదా లేదనడంతో పరిస్థితి మూలిగే నక్క మీద తాటికాయ పడ్డట్లయ్యింది.

- స్థలం కేటాయిస్తే...

## అందమైన శ్మశానం



క్రైస్తవ శ్మశాన వాటిక ఏర్పాటుకు స్థలం కేటాయిస్తే 90రోజుల్లో ప్రజల భాగస్వామ్యంతో అందమైన శ్మశాన వాటికను నిర్మించి ఇస్తానని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి పల్లె రఘునాధరెడ్డికి హైదరాబాద్‌లో వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్మశాన వాటిక లేకపోవడంతో నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని క్రైస్తవులు ఇబ్బందులు పడుతున్నారని, సమాధుల మీద సమాధులు కట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. శ్మశాన వాటిక ఏర్పాటుకు సంబంధించి గత రెండేళ్లుగా తహశీల్దార్ నుంచి ముఖ్యమంత్రి వరకు విజ్ఞాపనలు అందించినా ఇంతవరకు స్థలం కేటాయించకపోవడం విచారకరమన్నారు. గత అసెంబ్లీ సమావేశాల్లో తాను క్రిస్టియన్ శ్మశాన వాటిక గురించి ప్రస్తావిస్తే ప్రభుత్వ సానుకూలంగా స్పందించినా, కేటాయింపు మాత్రం జరగలేదన్నారు. ఈ సమస్యను త్వరిత గతిన పరిష్కరించాలని కోరారు.




16వ వర్ధంతి

కీ॥శే॥ శ్రీ జక్కా రంగారెడ్డి

(మరణం - 18.09.2000)

మహనీయుని దివ్యస్మృతికి మా భాష్పాంజలి

భార్య

జక్కా కామేశ్వరమ్మ

కుమారులు

జక్కా కోదండరామిరెడ్డి

జక్కా శ్రీనివాసులురెడ్డి

జక్కా శివనారాయణరెడ్డి

మరియు

కుటుంబసభ్యులు

# నెల్లూరు కబుర్లు

## నువ్వు... అయ్యవారిగానే కరెక్ట్!

### నారాయణకు చంద్రబాబు చురక

అసెంబ్లీ సమావేశాల చివరి రోజున ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శాసనమండలిలో ప్రసంగించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు ఆయనతో సెల్ఫీలు కూడా దిగారు. ఈ తరుణంలో పలువురి మధ్య ఏదో విషయమై చర్చ జరుగుతున్నప్పుడు మంత్రి నారాయణ కూడా జోక్యం చేసుకున్నాడు. నారాయణ మాట్లాడిన తీరు నచ్చక... నారాయణా... నువ్వు మంత్రిగా కంటే అయ్యవారిగానే కరెక్ట్ అని చంద్రబాబు అన్నట్లు సమాచారం. నెల్లూరుజిల్లా ప్రజలు ఏనాటి నుండో చెబుతున్న విషయాన్ని చంద్రబాబు చాలా ఆలస్యంగా తెలుసుకున్నాడు.

## విజయ డెయిరీ డైరెక్టర్ల ఎన్నికలు

నెల్లూరు వెంకటేశ్వరపురంలోని విజయ డెయిరీలో పదవీకాలం పూర్తయిన ముగ్గురు డైరెక్టర్లను ఎన్నుకోవడానికి ఈ నెల 26న ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఈమేరకు నోటిఫికేషన్ కూడా విడుదలైంది. 21న నామినేషన్ల స్వీకరణ, అదే రోజు స్క్రూటినీ ఉంటుంది. 22వతేదీ నామినేషన్ల ఉపసంహరణ గడువు. ఆ తర్వాత మిగిలిన అభ్యర్థులకు 26వతేదీ ఎన్నికలు నిర్వహిస్తారు. అదేరోజు ఫలితాలు కూడా వెల్లడవుతాయి.

## రెవెన్యూలో ఎన్నికల సెగ

జిల్లాలోని రెవెన్యూ కార్యాలయాలలో ఎన్నికల సెగ కనిపిస్తోంది. ఈ నెల 25వ తేదీన ఏపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ పాలకవర్గ ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఎన్నికల్లో ప్రధాన ప్యానెల్స్ జోరుగా ప్రచారం నిర్వహించాయి. నెల్లూరులోని తహశీల్దార్ కార్యాలయంతో పాటు అన్ని రెవెన్యూ కార్యాలయాల్లో ఎన్నికల హాట్ ఉండింది. ఓ పక్క వరుస సెలవులతో పాటు ఈ ఎన్నికలు కూడా రావడంతో ఉద్యోగులు అంతంతమాత్రమే పని చేయగా, పనుల మీద వచ్చిన ప్రజలు మాత్రం నిరాశతో వెళ్లారు.

### శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలకు

## స్తంభ ప్రతిష్ట

నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలో అక్టోబర్ 1 నుంచి 11వ తేదీ వరకు ఎంతో వైభవంగా జరుగనున్న శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలకు ఈ నెల 11న ఎంతో ఘనంగా స్తంభ ప్రతిష్ట జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు తంగిరాల రాధాకృష్ణ శర్మ నేతృత్వంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, బ్రహ్మోత్సవాల ఏర్పాట్లకు ప్రారంభసూచకంగా స్తంభ ప్రతిష్ట చేశారు. స్తంభ ప్రతిష్ట మహోత్సవంలో దేవస్థానం వ్యవస్థాపక కుటుంబ సభ్యులు రత్నం జయరాం, ఆలయ ఇ.ఓ పులి కోదండరామిరెడ్డితో పాటు, కార్పొరేటర్ దొడ్డపనేని రాజా, నన్నపురెడ్డి పెంచలరెడ్డి, ఉస్మాన్‌సాహెబ్‌పేట శ్రీ కోదండరామస్వామి-కాశీవిశ్వనాథస్వామి ఆలయం ఛైర్మన్ కొలపర్తి రమేష్‌బాబు, ఉప ప్రధాన అర్చకులు కుప్పచ్చి సుబ్బారావు స్వామి తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరులో టెన్షన్



సోమవారం నెల్లూరు జిల్లా కోర్టు ప్రాంగణంలో ప్రెషర్ కుక్కర్ బాంబు పేలిందన్నప్పుడు నగర ప్రజలు పెద్దగా ఆందోళన చెందలేదు. కోర్టులో పేలుడు కావడంతో కక్షల కోణంలో చూసారు. ఎవరన్నా నిందితులను టార్గెట్ చేసి పెట్టి ఉంటారనుకున్నారు. కాని ఈ పేలుడు వెనుక ఉగ్ర చర్యలున్నాయని మీడియాలో వార్తలు వచ్చినప్పటి నుండి ప్రజల్లో ఆందోళన మొదలైంది. ప్రశాంతతకు మారుపేరైన నెల్లూరులో కూడా అలజడి మొదలైంది. ఈ సంఘటన పోలీసుల్లో కూడా కలవరం తెచ్చింది. వాళ్లు కూడా హోటల్స్, లాడ్జీలను విస్తృతంగా గాలిస్తూ నిఘాను ముమ్మరం చేశారు.

## ఇస్కాన్‌లో రాధాష్టమి

నెల్లూరు గొలగమూడిరోడ్డులోని ఇస్కాన్ మందిరంలో ఈ నెల 9వ తేదీన రాధాష్టమి వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. మందిరం అధ్యక్షుడు డాక్టర్ సుఖదేవస్వామి ఆధ్వర్యంలో అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున ఈ వేడుకలో పాల్గొని తరించారు.



## వెంకయ్య ఇల్లు ముట్టడి



రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ 11వ తేదీ వైకాపా విద్యార్థి సంఘం, ఎన్ఎస్‌యుఐ, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాలు నెల్లూరు, రిత్విక్ ఎన్‌క్లేవ్‌లోని కేంద్రమంత్రి యం.వెంకయ్య నాయుడు ఇంటిని ముట్టడించే ప్రయత్నం చేసాయి. ముందుగా వున్న సమాచారంతో పోలీసులు ఆ ప్రయత్నాన్ని అడ్డుకోవడంతో విద్యార్థులు వెంకయ్యనాయుడు ఇంటికెళ్లే మార్గంలో బైఠాయించి ఆయనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విద్యార్థి సంఘాల నాయకులు వెంకయ్యనాయుడు మీద ఘాటుగా విమర్శలు చేసారు.

## దడ పుట్టించిన ఉన్మాది

### -- రాజరాజేశ్వరి అమ్మవారి గుడి గోపురం ఎక్కి వీరంగం --

ఒరిస్సాకు చెందిన ఉన్మాది తప్పతాగి నెల్లూరు దర్గామిట్టలోని శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం రాజగోపురంపైకి ఎక్కి హల్‌చల్ చేశాడు. 10వ తేదీ సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి గోపురం పైకెక్కి కిందికి దూకుతానంటూ పిచ్చిపిచ్చి చేష్టలు చేస్తుండడంతో దేవస్థానం సిబ్బంది పోలీసులకు, అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. రెండు గంటల పాటు శ్రమించి దేవస్థానం, అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టి గోపురం పైనుంచి తాళ్లతో కట్టి సురక్షితంగా అతడిని కిందకు దించారు.



## ఉత్తమ ఉపాధ్యాయుడికి వాకర్స్ అభినందన

రాష్ట్ర ప్రభుత్వం నుండి ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు స్వీకరించిన డి.వి. సుబ్బరాజును ఇటీవల నెల్లూరులోని ఏసి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ వాళ్లు స్టేడియంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి రమేష్‌బాబు, కోశాధికారి వి.రవిచంద్ర, సభ్యులు నలుబోలు బలరామయ్యనాయుడు, ఎస్.రాఘవేంద్రశెట్టి, దొరస్వామినాయుడు, సుధాకర్‌రాజు, వేణుగోపాల్‌రెడ్డి, ఓబులరెడ్డి, సుబ్బరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.





## సింధును సత్కరించిన కిషోర్

ఒలింపిక్స్‌లో రజత పతకం సాధించిన పి.వి.సింధును ఇటీవల హైదరాబాద్‌లో కిషోర్స్ రత్నం విద్యాసంస్థల అధినేత డాక్టర్ కె.కిషోర్ సత్కరించారు. నెల్లూరుజిల్లా గత ఎస్పీ, ప్రస్తుత న్యాయ వ్యవహారాల ఐజి ఈతముక్కల దామోదర్ ఇంట గౌరవార్థం ఇచ్చిన విందుకు ఆమె హాజరయ్యారు. ఈ విందుకు హాజరైన కిషోర్ సింధును, ఆమె గురువు, అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పుల్లెల గోపీచందను కూడా అభినందించారు.

## అధ్యాపకుల సేవలు మరువలేనివి



ఉద్యోగ విరమణ చేసిన అధ్యాపకుల సేవలు మరువలేనివని, వారి అనుభవాన్ని, సేవలను ఇంకా కూడా ఉపయోగించవలసిన అవసరం ఉందని వి.ఆర్ కళాశాల పాలకవర్గ కార్యదర్శి అండ్ కరస్పాండెంట్, మాజీఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి పేర్కొన్నారు. ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన డి.దశరథ రామిరెడ్డి, జి.అనంతశేషసాయిలను కళాశాల సెమినార్ హాల్‌లో కళాశాల ఆక్టా ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఆనం వివేకానందరెడ్డి మాట్లాడుతూ కళాశాలలో అమూల్యమైన సేవలందించిన అధ్యాపకులు కళాశాల విడిచి వెళ్లడం బాధాకరమన్నారు. వారి సేవలను మరింతగా ఉపయోగించుకుంటామన్నారు.

కళాశాల సిఇఓ పి.సుధాకర్‌రెడ్డి, కమిటీ సభ్యుడు జహీర్‌అహమద్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సివిఎస్ భాస్కర్, ఆక్టా ఛైర్మెన్ డాక్టర్ బాబర్ ఆలీమొహిద్దీన్, ప్రెసిడెంట్ డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం, వైస్‌ప్రెసిడెంట్ సి.శ్యామల తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌సిసి కేడెట్‌లకు అభినందన



నెల్లూరు ఎన్‌సిసి కేడెట్‌ల ప్రతిభను ప్రశంసిస్తూ ఈ నెల 10న వారికి అభినందన సభ ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు సంయుక్తంగా విశాఖపట్నంలో జరిగిన ఎన్‌సిసి నావెల్ వింగ్ ఇంటర్ గ్రూప్ కాంపిటీషన్స్‌లో ప్రతిభచూపిన నెల్లూరు కేడెట్లను ఈ సభలో అభినందించారు. నెల్లూరు వి.ఆర్ కళాశాలలో జరిగిన ఈ సభలో ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సివిఎస్ భాస్కర్ మాట్లాడుతూ, తొమ్మిదేళ్ళ తరువాత 10 (ఏ) నావెల్ యూనిట్ నుంచి తొమ్మిదిమంది కేడెట్లు అఖిలభారత స్థాయిలో నవసైనిక్ క్యాంప్‌కు ఎంపిక కావడం ఎంతో సంతోషదాయకమన్నారు. ఈ కేడెట్లకు రెండు నెలల పాటు శిక్షణ అందించిన స్థానిక పిఐ స్టాఫ్, ఏఎన్ఓలను డాక్టర్ భాస్కర్ అభినందించారు. విశాఖలో ఆగస్టు 29 నుంచి సెప్టెంబర్ 7వ తేదీ వరకు జరిగిన సీమెన్‌షిప్ ప్రాక్టికల్స్‌లో కె. యుగేష్ బంగారుపతకం సాధించాడని, అదేవిధంగా ఏవి సుబ్బారెడ్డి, ఎ.శేఖర్, ఆర్.మహేష్, ఎన్ సాయిశంకర్, ఏ.కామాక్షి, పి.అనూష సంయుక్తంగా 10(ఏ) నావెల్ యూనిట్ ఎన్‌సిసి తరపున ప్రథమ స్థానంలో నిలవడం ఎంతో అభినందనీయమని వక్తలు ప్రశంసించారు. షిప్ మోడలింగ్‌లో పాల్గొన్న జి. మహేంద్ర, కె.సుందర్‌సాయి, ఐ.శ్రీకళ, ఎ.సునంద ద్వితీయ స్థానం సాధించడం ఎంతో సంతోషకరమన్నారు. బెస్ట్ కేడెట్‌గా జి.అజిత్ పూర్తిస్థాయిలో ప్రతిభ సాధించడం అభినందనీయమన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సివిఎస్ భాస్కర్‌తో పాటు, లెఫ్టినెంట్ కమాండర్ ఎన్.ప్రభాకర్, ఎస్ఎంఐ ఎస్వి రమణ్, పిఐ స్టాఫ్ పి.ఓ ఎస్.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొని ఎన్‌సిసి కేడెట్‌లను అభినందించారు.

# హడ్కో... ఉస్కో?

- ➢ భూగర్భ డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్ పనులపై సందేహం
- ➢ ఆరంభ శూరత్వంగా మిగిలిపోనున్న పనులు



1100కోట్ల హడ్కో నిధులతో నెల్లూరు నగరంలో భూగర్భడ్రైనేజీ.. శాశ్వత మంచినీటి పైప్‌లైన్ పనులు... కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు, రాష్ట్ర మంత్రి నారాయణల ఘనకార్యమిది... ఈ పనులతో నెల్లూరు స్వరూపమే మారిపోతుందంటూ ఓ పక్క పాలకులు ప్రకటనలు దంచారు.

మరోపక్క ఈ హడ్కో నిధుల పనులతో నెల్లూరుకు ముప్పు, అప్పు తప్ప ఇంకేం ఒరిగేదేమీలేదు. ఈ అప్పును ప్రజలే కట్టాలి. ప్రతి తలపై 5వేల రూపాయల అదనపు భారం పడబోతుంది. నెల్లూరు సెప్టిక్ ట్యాంక్‌గా మారబోతుంది. ఈ హడ్కో పనులే మనకొద్దంటూ కేతంరెడ్డి వినోద్‌రెడ్డి ఉద్యమం మరోపక్క..

ఏదైతేనేం... నెల్లూరు ప్రజలపై భారం దిగినట్లే కనిపిస్తోంది. టెండర్లు కూడా జరిగిపోయి పనులు మొదలుపెట్టాల్సిన సమయంలో నగరంలో భూగర్భ డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్‌ల పనులు ఆగిపోయినట్లు తెలుస్తోంది. మంచినీటి పైప్‌లైన్‌ల కోసమని కాంట్రాక్టర్లు నగరంలో అక్కడక్కడా తోలిపెట్టిన పైపులను కూడా రేపోమాపో తరలించే అవకాశాలున్నాయి.

నెల్లూరులో మంచినీటి, భూగర్భడ్రైనేజీ కంటూ 1100కోట్ల హడ్కో ఋణం మంజూరైంది. కేంద్ర మంత్రి వెంకయ్యనాయుడు, రాష్ట్రమంత్రి నారాయణలు ఈ హడ్కో అప్పుపై బాగానే శ్రద్ధ చూపారు. దీనికి సంబంధించి 2015ఏప్రిల్‌లో సంతకాలు పెట్టి, టెండర్లను కూడా పిలిచి ఎల్‌అండ్‌టి, మెగా ఇంజనీరింగ్ కంపెనీలకు పనులు అప్పగించారు. మంచినీటి పైప్‌లైన్ పనులకు సంబంధించి 476.31కోట్లకు రాష్ట్ర ప్రభుత్వం గ్యారంటీ ఇచ్చింది. మొత్తం 1100కోట్ల ఋణంలో నెల్లూరు నగరపాలక సంస్థ 10శాతం వాటాను భరించాలి. అంటే 110కోట్లన్న మాట! ఇక 3నెలలకొకసారి ఇన్‌స్టాల్‌మెంట్‌లాగా మూడుకోట్లు కట్టాలి. ఇంత భారాన్ని నగరపాలక సంస్థ భరించే స్థితిలో లేదు, నెలొచ్చేసరికి జీతాలివ్వడానికి, కరెంట్ బిల్లులు కట్టుకోవడానికే వెదుక్కోవాల్సిన పరిస్థితి. ప్రజలపై ఇప్పుడున్న పన్నులే ఎక్కువ. ఇంకా ఎక్కువ భారం మోపితే తంతారు. కాబట్టి నెల్లూరుకు కార్పొరేషన్‌ను రీపేమెంట్ సామర్థ్యం లేదు. ఇదంతా కేంద్రంలో వెంకయ్య, రాష్ట్రంలో నారాయణ చూసుకుంటారులే అని గుడ్డిగా ఆమోదించేసారు.

ఇప్పుడు సీన్ రివర్సయ్యింది. మంచినీటి పైప్‌లైన్ కాంట్రాక్టర్ పైప్‌లు, ఇతరత్రా సామాన్లకు సంబంధించి 60కోట్లకు బిల్ పెట్టినట్లు తెలుస్తోంది. ఇందులో కార్పొరేషన్ వాటాగా 6కోట్లు భరించాలి. ఇక్కడ అంత సీన్ లేదు. అందుకే ఈ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించాలంటూ లేఖ వ్రాశారు. అయితే రాష్ట్రప్రభుత్వం దీనికి స్పందించలేదు. ఈ డబ్బులు మొదటి నుండి ఇస్తామని మేం చెప్పలేదు, పనులు పూర్తయ్యాక వాయిదాలు చెల్లించడంలో మీరు డిఫాల్ట్ అయితే మేం చూసుకుంటామని, మంచినీటి పైప్‌లైన్ పని వరకు గ్యారంటీ ఇచ్చాం, దీనికింకా చాలా టైముంది, ముందు మీరు చేయాల్సిన పని చేయండని చెప్పినట్లు తెలుస్తోంది. అదే సమయంలో హడ్కో వాళ్లు కూడా ఇన్‌స్టాల్‌మెంట్ కట్టండంటూ కార్పొ రేషన్‌పై ఒత్తిడి తెచ్చారు. ఈ రెండూ మేం కట్టే పరిస్థితిలేదని మేయర్ చేతులెత్తేసాడు. దీంతో కాంట్రాక్టర్లు సందిగ్దంలో పడ్డారు. పనులను నిలిపేసారు. హడ్కో నిధులు ఇక వెనక్కి పోయినట్లేనని భావించవచ్చు. కాగల కార్యం గంధర్వులే తీర్చారన్నట్లు... భూగర్భడ్రైనేజీ పనులు ఆపేయాలని కేతంరెడ్డి వినోద్‌రెడ్డి ఉద్యమం చేస్తున్నా, పరిస్థితులు వాటంతట అవే తిరగబడి పనులు ఆగిపోవడం యాదృచ్ఛికమే అయినా, అతని ఉద్యమానికి తగిన విధంగానే ఫలితం రావడం విశేషం.

### వెంకయ్యపై...
## పవన్ విమర్శలు అర్థరహితం
### - బిజెపి నాయకుల ధ్వజం



రాష్ట్రాభివృద్ధికి నిరంతరం ఎంతగానో కృషి చేస్తున్న కేంద్రమంత్రి వెంకయ్యనాయుడిపై సినీనటుడు పవన్ కళ్యాణ్ విమర్శలు చేయడం దారుణమని, ఆ విమర్శలు అర్థరహితమని.. అసలు పవన్‌కు వెంకయ్యనాయుడిని విమర్శించే స్థాయి లేదని బిజెపి నేతలు ధ్వజమెత్తారు. నెల్లూరులోని బిజెపి కార్యాలయంలో ఈ నెల 11న ఏర్పాటుచేసిన సమావేశంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు పి.సురేంద్రరెడ్డి మాట్లాడుతూ, స్థాయిని మరచి పవన్ ఇలా విమర్శలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. చిత్తశుద్ధితో ప్రజలకు పనిచేస్తామంటే ఎవరైనా హర్షిస్తారని, అలాకాక ఇలా లేనిపోని విమర్శలతో కాలయాపన చేయడం వల్ల ఒరిగేదేమీ లేదన్నారు. లడ్డూలు పాచిపోతాయేమో కానీ, రాష్ట్రానికి కేంద్రం ఇచ్చే నిధులు పాచిపోవని పవన్ తెలుసుకోవాలన్నారు. రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్ ప్రజల హక్కుల కోసం పోరాడింది ఒక్క బిజెపియేనని, రాష్ట్రాభివృద్ధికి బిజెపి, కేంద్రప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నాయని వారు పేర్కొన్నారు. రాష్ట్ర అభ్యున్నతి లక్ష్యంగా.. అన్నివిధాలా సహకరిస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని గానీ, బిజెపినిగానీ, రాష్ట్రాభివృద్ధికి ఎంతో చేయూతనందిస్తున్న వెంకయ్యనాయుడిని గానీ విమర్శించడంలో అర్థం లేదన్నారు. ఈ సమావేశంలో బిజెపి సీనియర్ నాయకులు దువ్వూరు రాధాకృష్ణారెడ్డి, నాయకులు మండ్ల ఈశ్వరయ్య, చక్రవర్తి, నరసింహులునాయుడు, కాయల మధు తదితరులు పాల్గొన్నారు.

## తెలుగుతల్లికి తీరని ద్రోహం
### వెంకయ్యపై అనిల్ ఫైర్



మొన్నటిదాకా జిల్లా అభివృద్ధికి నయాపైసా పని చేయలేదంటూ మున్సిపల్ మంత్రి నారాయణను పట్టుకుని విమర్శలతో ఉతికి ఆరేసిన నెల్లూరునగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్ తాజాగా కేంద్ర మంత్రి యం.వెంకయ్యనాయుడు మీద పడ్డాడు. తన వయసు వెంకయ్యనాయుడికి వున్న రాజకీయ అనుభవమంత లేదంటూనే ఆయనపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తాడు. నిద్రలేస్తే కన్నభూమి, పెరిగిన ఊరు, పెంచిన తల్లిదండ్రుల గురించి గొప్పగా చెప్పే వెంకయ్యనాయుడు తన రాష్ట్రానికి మాత్రం తీరనిద్రోహం చేశారని 12వ తేదీ నెల్లూరులోని రాజన్నభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విమర్శించారు. ఆయన ఉపరాష్ట్రపతి పదవి కోసం ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలను, 5కోట్ల మంది భవిష్యత్‌ను తాకట్టు పెడుతున్నాడు. దీనిని చరిత్ర క్షమించదు. విభజన సమయంలో పార్లమెంటులో ఆంధ్రాకు ఐదేళ్లు కాదు పదేళ్లు హోదా కావాలని వెంకయ్యనాయుడు వాదిస్తుంటే చూసి సంబరపడ్డాం. ఆరోజు ప్రజలంతా ఆయన్ను అభినందించారు. కాని ఈరోజు అదే నోటితో హోదా లేదంటూ, రాదంటూ, అసలు హోదాతో ఉపయోగమేలేదంటూ నానా రకాలుగా మాట్లాడుతున్నాడు. అధికారంలోకి వచ్చాక రెండున్నరేళ్ల నుండి అదిగో హోదా, ఇదిగో హోదా అంటూ నెట్టుకొచ్చి ఇప్పుడు ఒక్కసారిగా రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టేస్తారా? ఉపరాష్ట్రపతి పదవీ కాంక్షతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తారా? అంటూ అనిల్ ప్రశ్నించాడు. ప్రత్యేకప్యాకేజీ పేరుతో సొంత లాభాలు చూసుకుంటున్న టిడిపి, బీజేపీ నాయకులు రాష్ట్రానికి వెన్నుపోటు పొడిచారని, వెంకయ్యనాయుడు నెల్లూరుకు వస్తే అడ్డుకుంటామని అనిల్ హెచ్చరించాడు.

ఈ సమావేశంలో కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ పి.రూప్‌కుమార్‌యాదవ్, కార్పొరేటర్లు రవిచంద్ర, మాధవయ్య, అశోక్, నాగరాజు, ఖలీల్‌అహ్మద్, వైసిపి నాయకులు వేలూరు మహేష్, వందవాసి రంగ, వంగాల శ్రీనివాసులు పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు


## అపోలోలో అత్యాధునిక బ్లడ్‌బ్యాంక్



నెల్లూరులోని అపోలో స్పెషాలిటీ హాస్పిటల్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేసిన అత్యాధునిక బ్లడ్‌బ్యాంక్‌ను బుధవారం మాజీఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి ప్రారంభించారు. ప్రజలకు ఈ బ్లడ్‌బ్యాంక్ ద్వారా వివిధ సేవలు అందుబాటులో ఉంచామని, దీని ద్వారా నెల్లూరులో ఉండే అన్ని రకాల బ్లడ్ కాంపోనెంట్స్ సదుపాయాలు ఇప్పుడు అపోలోలో 24గంటలు అందుబాటులో ఉన్నాయని వైద్యులు తెలిపారు. అన్ని రకాల అత్యవసర కేసులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో నెలకొల్పబడిన ఈ బ్లడ్‌బ్యాంకులో అత్యాధునికమైన పరికరాలు, యంత్రాలు, అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో పాటు అర్హత, అనుభవంగల సాంకేతిక సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. రక్త మార్పిడి వల్ల సంభవించే వివిధ సమస్యలు, అంటువ్యాధులు తగ్గించడానికి ల్యూకోరిడక్షన్ ఫిల్టర్ని అందుబాటులోకి తెస్తున్న ఏకైక బ్లడ్ బ్యాంకు అపోలో అని పేర్కొన్నారు. యూనిట్ హెడ్ నవీన్, డా॥ శ్వేత పాల్గొన్నారు.



# ఇక సామాన్యుడి చెంతకు మంగళయాన్



తెలుగు పుస్తకం రూపంలో సామాన్యుడి చెంతకు మంగళయాన్ వివరాలు త్వరలో రానున్నాయి. మంగళయాన్ (మార్స్ ఆర్బిటర్ మిషన్) ప్రయోగం ఇస్రో చరిత్రలో మరుపురానిది. శాస్త్రవేత్తలు భావించిన దానికన్నా మొదటిసారిగా విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశించింది. అమెరికా, రష్యా లాంటి దేశాలు మూడు, నాలుగుసార్లు ఇలాంటి ప్రయోగాలు చేస్తేగాని అనుకున్న లక్ష్యాన్ని ఛేధించలేకపోయాయి. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ మాత్రం మొదటిసారే ఆ ప్రయత్నాన్ని విజయవంతంగా పూర్తి చేసింది. మంగళయాన్ ఫోటోలు, దానికి సంబంధించిన పూర్తి వివరాలు అందరికీ అర్ధమయ్యే రీతిలో బిఆర్ గురుప్రసాద్ ఆంగ్లంలో పుస్తకరూపంలో రాసి ఆవిష్కరించారు. దానిని దేశంలోని అన్ని భాషల్లో అనువదించి సామాన్యుల చెంతకు చేరేలా ఇస్రో ప్రయత్నించింది. ఇందులో భాగంగా ఆంగ్లంలో ప్రచురించిన పుస్తకాన్ని షార్ విశ్రాంత శాస్త్రవేత్త వెల్లంకి శేషగిరిరావు తెలుగులోకి అనువాదం చేశారు. మంగళయాన్‌కు సంబంధించిన పూర్తి వివరాలతో తెలుగులో పుస్తకాలను ఇస్రో ముద్రించి పంపిణి చేస్తోంది.

# నోరు తెరిస్తే... పచ్చి అబద్దాలే!

## - చంద్రబాబుపై ప్రసన్న సెటైర్



ఎన్టీఆర్‌కు పార్టీ పెట్టమని చెప్పింది నువ్వా అంటూ వైయస్సార్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై వ్యంగోక్తులు విసిరారు. బాబు నోరు తెరిస్తే అంతా అబద్దాలేనని ఎద్దేవా చేశారు. నెల్లూరుజిల్లా ఇందుకూరుపేట మండలం దేవిస్‌పేటలో ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ చంద్రబాబునాయుడు హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన మాటలు అతను అబద్దాల కోరని చెప్పడానికి నిదర్శనమన్నారు. ఎన్టీఆర్ కుమార్తెతో చంద్రబాబుకు పెళ్లి కుదిర్చింది వాస్తవానికి శ్రీకాళహస్తి మాజీఎమ్మెల్యే సుబ్రహ్మణ్యం నాయుడని తెలిపారు. కాంగ్రెస్‌లో ఉంటూ చిత్తూరుజిల్లాలో తెలుగుదేశంపార్టీ జెండాలు తగులబెట్టించింది చంద్రబాబేనన్నారు. అప్పట్లో కాంగ్రెస్ అధిష్టానం ఆదేశిస్తే రామారావుపై పోటీ చేస్తానని చెప్పింది చంద్రబాబేనన్నారు. చంద్రబాబును అప్పట్లో టీడీపీలో చేర్చుకునేందుకు నాదెండ్ల భాస్కరరావు, ఆయన వర్గం ఒప్పుకోకపోతే తన తండ్రి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఉపేంద్ర తీసుకోమని చెప్పారన్నారు. పదవ తరగతి చదివే లోకేష్‌ను ప్రధానమంత్రి పదవి కావాలా అని చంద్రబాబునాయుడు అడిగితే వద్దన్నాడని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. లోకేష్ పప్పు సుద్ధ అని చెప్పడానికి ఎన్నికల్లో ఆయన మాట్లాడిన మాటలే నిదర్శనమన్నారు. అబ్దుల్‌కలాంను రాష్ట్రపతిని చేసింది, రియో ఒలింపిక్స్‌లో సింధుకు పతకం వచ్చేలా చేసింది, గోపిచంద్‌కు శిక్షణ ఇచ్చింది తానేనని చెప్పడం అతని దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. రాష్ట్ర ప్రజలందరికీ పెళ్లిళ్లు చేసింది కూడా తానేనని చెప్పినా ఆశ్చర్యపోనక్కర్లేదన్నారు. ఈ సమావేశంలో వైయస్సార్సీపీ రాష్ట్ర రైతు విభాగం ప్రధానకార్యదర్శి మావులూరి శ్రీనివాసులురెడ్డి, బిసి సెల్ ప్రధాన కార్యదర్శి గోల్లపల్లి విజయకుమార్, జడ్పీటీసీ బి.వి.రమణయ్య పాల్గొన్నారు.

# క్రీడల ఆవశ్యకతపై కవి సమ్మేళనం



నెల్లూరుజిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో క్రీడల ఆవశ్యకతపై సోమవారం నెల్లూరు టౌన్‌హాల్ వర్ధమాన సమాజంలో కవి సమ్మేళనం జరిగింది. సభాధ్యక్షులుగా నెరసం అధ్యక్షులు ఎ.జయప్రకాష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా క్రీడలపై అవగాహన కలిగించడానికి డిగ్రీ కళాశాల విద్యార్థులకు 'క్రీడలు – ఆవశ్యకత' అంశంపై వకృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రభుత్వ బిఇడి కళాశాలకు చెందిన అమరావతి, శ్రీలత, హర్షకుమార్ వరుసగా ప్రధమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందుకున్నారు. అనంతరం నిర్వహించిన కవిసమ్మేళనంలో పాల్గొన్న కవులు ఇదే అంశంపై తమ కవితలను వినిపించారు. ఈ సందర్భంగా నెల్లూరుజిల్లా టి.పి.గూడూరుకు చెందిన చెన్నెపల్లిపాళెం ఫిజికల్ డైరెక్టర్ పావురాల వేణును సన్మానించారు. ఉత్తమ రాష్ట్ర ఉపాధ్యాయులుగా అవార్డు పొందిన వేణు క్రీడల గురించి వాటి ప్రాముఖ్యతను గురించి వివరించారు. ఈ కార్యక్రమాన్ని నెరసం ప్రధానకార్యదర్శి పాతూరి అన్నపూర్ణ నిర్వహించగా ఉపాధ్యక్షులు మాటేటి రత్నప్రసాద్, ప్రముఖకవి డా॥ చీమకుర్తి వెంకటేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

# వృద్ధులకు రోటరీ హెల్పేజ్ ఫలసరుకులు



వృద్ధులకు ఫలసరుకులు పంపిణీ చేస్తున్న డిసిసి అధ్యక్షుడు పనబాక కృష్ణయ్య

గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి రోటరీ భవన్‌లో ఈ నెల 10వ తేదీ రోటరీ హెల్పేజ్ ఆధ్వర్యంలో వృద్ధులకు ఫలసరుకులను డిసిసి జిల్లా అధ్యక్షుడు పనబాక కృష్ణయ్య పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో వున్న వృద్ధులను ఆదుకుంటే మంచి చేసినవారమవుతామన్నారు. ఈ సందర్భంగా 10వేల నగదును విరాళాన్ని నిర్వాహకులకు అందించారు. ఆవాస దశలో ఉన్నవారిని మేమున్నామంటూ ఆదుకోవడం గొప్ప విషయమన్నారు. సేవ చేయడం ద్వారా ఎంతో తృప్తి పొందచన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ మాజీఅధ్యక్షుడు ఎస్వీ అశోక్ చక్రవర్తి, కార్యదర్శి హరిప్రసాద్, కె.మునిగిరీష్, మునిరాజా, మోహన్‌రెడ్డి, రాము, రఘురామిరెడ్డి, మయూరి శ్యాంయాదవ్, రమణబాబు, మనోహర్‌రెడ్డి, రత్నం తదితరులు పాల్గొన్నారు.

## నవంబర్ 13న నెల్లూరులో
# బ్రాహ్మణ సేవా సంఘాల సమావేశం



వై.చలపతిరావు

నవంబర్ 13న నెల్లూరు, రంగనాయకుల స్వామి కళ్యాణ మండపంలో ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల బ్రాహ్మణ సేవా సంఘాల సమావేశం జరుగుతుందని గూడూరు బ్రాహ్మణ సేవాసంఘం అధ్యక్షులు యరగుడిపాటి చలపతిరావు తెలిపారు. ఆయన 10వ తేదీ విలేకర్లతో మాట్లాడుతూ ఈ సమావేశానికి భారీగా బ్రాహ్మణులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. తమ సమస్యలను చెప్పేందుకు పేదబ్రాహ్మణులు ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఛైర్మెన్ ఐవైఆర్ క్రిష్ణారావు ఇచ్చిన నిధులను ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు స్వయంపాకుల శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు వాసుదేవరావు, జిల్లా కోశాధికారి కామేశ్వరి ప్రసాద్, సంఘ ఉపాధ్యక్షుడు ఆనిమెళ్ళ శివకుమార్, నాథబ్రహ్మం, కార్యదర్శి చిట్టమూరు శ్రీనివాసరావు, నాగేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్ వార్తలు

# విద్యార్థికి ఇన్నర్‌వీల్ సైకిల్




విద్యార్థికి సైకిల్, దుస్తులు అందజేస్తున్న డాక్టర్ రోహిణి, స్నేహలతారెడ్డి తదితరులు

గూడూరు ఇన్నర్‌వీల్ క్లబ్, ఆంధ్ర మహిళా మండలి ఆధ్వర్యంలో డిగ్రీ చదువుతున్న విద్యార్థికి సైకిల్, దుస్తులు ఇతర వస్తువులను సోమవారం పంపిణీ చేశారు. ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు వై. స్నేహలతారెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కష్టపడి చదువుకుంటే జీవితంలో ఉన్నతస్థాయికి చేరుతారని, దాతల సేవలు వృధా కానివ్వకుండా బాగా చదువుకుని ప్రజలకు సేవలు చేయాలని కోరారు. ప్రతి విద్యార్థి ఉన్నతస్థాయికి వెళ్లాలని కోరారు. ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి మాట్లాడుతూ దాత డాక్టర్ సుగుణ చేస్తున్న సేవలను కొనియాడారు. ఇన్నర్‌వీల్, ఆంధ్ర మహిళా మండలి ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేపడుతూ ముందుకు వెళుతున్నామని అన్నారు. డేనియల్ హోంలో చదువుతున్న నవీన్‌కుమార్ అనే విద్యార్థికి సైకిలు బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఇన్నర్‌వీల్, ఆంధ్ర మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

# వాకర్స్ క్లబ్ 2కె రన్



2కె రన్‌ను చేపడుతున్న వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

నడక ద్వారా ఆరోగ్యకరంగా ఉండవచ్చని రూరల్ సిఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ఆదివారం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 2కె రన్‌ను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ నడక ద్వారా అనేక రోగాలు దరిచేరవని, నడక లేని కారణంగా చిన్న వయస్సులోనే స్థూలకాయం, డయాబెటిస్ బారిన పడుతున్నారని చెప్పారు. క్రమం తప్పకుండా ఆరోగ్య నియమాలు పాటించడంతో జీవితాంతం సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని తెలిపారు. పట్టణంలో 2కెరన్‌ను చేపట్టారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ ప్రతినిధులు వేగూరు రాజేంద్రప్రసాద్, వాసుగౌడ్, పి.శ్రీనివాసులురెడ్డి, పేటేటి గిరి, చంద్రశేఖర్, రమేష్, కె.మునిగిరీష్ పాల్గొన్నారు.

# బలైపోతున్న బలహీనవర్గాలు

## - ఆర్.కె.యాదవ్



మాట్లాడుతున్న ఆర్.కె.యాదవ్, నాశిన భాస్కర్‌గౌడ్ తదితరులు

కులాల వారీగా గణాంకాలు ప్రకటించకుండా బీసీ కులాల ఆదాయ పరిమితిని రూ.8లక్షలు పెంచే ప్రతిపాదన తీసుకురావాలనుకోవడంతో బీసీ కులాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆంధ్రప్రదేశ్ బి.సి.సంక్షేమ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.కె.యాదవ్ అన్నారు. స్థానిక ఎంపిడిఓ కార్యాలయ ఆవరణలో పలువురితో కలసి సోమవారం ఆయన మాట్లాడుతూ బి.సి. కులాల వార్షిక ఆదాయ పరిమితిని రూ.8లక్షలకు పెంచేందుకు క్రిమిలేయర్ సిస్టంలో ప్రధాని కార్యాలయానికి సిఫార్సు చేసిందన్నారు. దీనికి అంగీకారం తెలిపితే అక్టోబర్ తొలివారంలోనే క్యాబి నెట్ ముందుకు వెళ్ళే అవకాశం ఉందన్నారు. ఇలా జరిగితే కేంద్రప్రభుత్వ ఉద్యోగుల్లో 27శాతం రిజర్వేషన్ పొందే బి.సి. కులాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో బీఎస్పీ నాయకులు నాశిన భాస్కర్‌గౌడ్, ఎం.కృష్ణయ్య, రమణయ్య, ప్రభాకర్‌యాదవ్, పుల్లయ్య, శీనయ్య ఉన్నారు.

# ఆంధ్రాకు గుజరాత్ ఉప్పు

గల్పిక

ప్రత్యేకహోదా వస్తే తన బ్రతుకు ప్రత్యేకంగా మారుతుందని ఆశించి, భారతదేశానికి రాష్ట్రపతులను, ప్రధానమంత్రులనే కాకుండా ప్రపంచానికి బిల్‌గేట్స్, సత్య నాదెళ్ల వంటి పుణ్యాత్ములను అందించిన చంద్రబాబు నాయకత్వంలో మాకేమి లోటంటూ గుండెల నిండా ఆత్మస్థైర్యం నింపుకుని కోటి రూపాయలు అప్పు చేసిన 'ఆంధ్రా అపరిచితుడు' ఏపికి ఇక ప్రత్యేకహోదా ఇచ్చేది లేదంటూ కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ ప్రత్యేకంగా అర్థరాత్రి సమావేశం ఏర్పాటు చేసి చెప్పడంతో నీరుగారి పోయాడు. ఆ సమయంలో అతని కళ్లకు అరుణ్‌జైట్లీ మరో చిదంబరం లాగా కనిపించాడు. 2009 డిసెంబర్‌లో చిదంబరం కూడా అదే అర్ధరాత్రి రాష్ట్ర విభజన ప్రకటన చేశాడు. కాబట్టి చిదంబరాన్ని జైట్లీ మరోసారి గుర్తు చేశాడు. జైట్లీ ప్రకటన చూసాక ఆంధ్రా అపరిచితుడి రక్తం సల సల మరిగిపోయింది. ఇంత నమ్మకద్రోహమా? నిద్రలేస్తే నీతి, విలువలు గురించి మాట్లాడే నాయకులు వీళ్లేనా? జైట్లీ కంటే ఈ రాష్ట్రం మీద ప్రేమ లేదు, మరి విభజన సమయంలో ఏపికి పదేళ్లు హోదా కావాలంటూ అరచి గీపెట్టిన ఆ వెంకయ్యనాయుడుకేమైంది. జైట్లీ హోదా లేదంటుంటే పక్కనే కూర్చుని ఆయన తాళం వేయడమేంటి? అపరిచితుడు తెగ మదనపడిపోసాగాడు. నా ఒంటిలోని బ్లడ్డే ఇంత హీటెక్కిపోతే, ఇక అహర్నిశలు ఆంధ్రా అభివృద్ధి గురించి ఆలోచిస్తూ, నిద్రలో కూడా ప్రత్యేకహోదాను కలవరించే చంద్రబాబునాయుడు గారు ఇంకెంత ఫైర్ అవుతారో... ఆయనలో మరో ఛండశాసనుడిని, మరో సింహాను, మరో బొబ్బిలిపులిని ఈ బీజేపీ వాళ్లు చూడబోతున్నారు, నిద్రపోతున్న కొండవీటి సింహాన్ని వీళ్లు నిద్రలేపారు అని అనుకుంటుండగా... అప్పుడే టీవీలో చంద్రబాబు ప్రెస్‌మీట్ కొచ్చాడు. విలేకరులంతా అలర్ట్ అయ్యారు. చంద్రబాబు ముఖం గంభీరంగా వుంది. టీవీలో అది చూస్తున్న ఆంధ్రా అపరిచితుడు... వాతావరణం తుఫాన్ ముందటి ప్రశాంతంలాగా వుంది. చంద్రబాబు బ్లాస్ట్ కాబోతున్నాడు... కేంద్రంలో నరేంద్ర మోడీ కుర్చీ కదలబోతుంది.. తెలుగువాడి పౌరుషాన్ని, ఆంధ్రావాలా ఆగ్రహాన్ని ఈరోజు చంద్రబాబు ఢిల్లీ వాళ్లకు చూపించబోతున్నాడని అపరిచితుడు మనసులో అనుకోసాగాడు. చంద్రబాబు మాట్లాడ్డం మొదలు పెట్టాడు. "చచ్చినోడి పెళ్లికి వచ్చిందే కట్నం" అనే సామెత మీరు వినే వుంటారు, ఈరోజు మన పరిస్థితి కూడా అంతే! ప్రత్యేకహోదా అని పట్టుబడితే మనకి గోచీ గుడ్డ కూడా మిగిలేటట్లు లేదు. అయినా ప్రత్యేకహోదాతో ఒరిగేదేముంది. ప్యాకేజీలో వున్న కిక్కు ప్రత్యేకహోదాలో ఉంటుందా? ప్రత్యేకహోదా రాదని నాకు అప్పుడూ తెలుసు, ఇప్పుడూ తెలుసు. ఇకముందు కూడా రాదని తెలుసు. అయినా మీ కంటి తుడుపు కోసం ప్రత్యేకహోదాకు పోరాడుతూనే వుంటాను, ప్యాకేజీ ఇచ్చినందుకు మోడీకి ధన్యవాదాలు. అలాగే దయతలచి ప్రత్యేకహోదా ఇస్తే రాష్ట్రాన్ని కూడా అభివృద్ధి చేసుకుంటామని ప్రెస్‌మీట్ ముగించాడు. అదంతా చూసిన అపరిచితుడికు తల 160కిలోమీటర్ల వేగంతో తిరగసాగింది. చంద్రబాబు ఇచ్చిన ఆ షాక్‌తో ఆంధ్రా అపరిచితుడు ఓ పూటంతా కోమాలోకి వెళ్లిపోయాడు.

కాకినాడలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సభ పెడుతున్నాడని, ప్రత్యేకహోదాపై అక్కడ బాంబులు పేల్చబోతున్నాడన్న సమాచారం రావడంతో ఆంధ్రా అపరిచితుడు ఆశగా ఆ సభకు వెళ్లాడు. పవన్ కళ్యాణ్ సభ మొదలైంది. జనం కూడా బాగానే వచ్చారు. పవన్ స్పీచ్ మొదలైంది. చూడు వెంకయ్యా... సింహంతో వేట... ఈ పవన్‌తో ఆట ఒక్కటే... సింహాన్ని చూడాలనుకో, తప్పులేదు... కాని ఫోటో దిగాలనుకోవద్దు... నేను సింహం లాంటివాణ్ణబ్బా... కాకపోతే అది క్రాఫ్ చేయించుకోదు, నేను చేయించుకుంటానంతే... ప్రత్యేకహోదా ఇమ్మంటే రెండు పాచిపోయిన లడ్డులిస్తారా? నాక్కొంచెం తిక్కుంది... దానికి లెక్కుంటూ లేదు అని డైలాగ్‌లు వదలుతుండగా, అపరిచితుడు మనసులో... నీ తిక్క సంగతి తర్వాత... కాకినాడలో మీటింగ్ పెట్టి లడ్డులంటావేం... శుభ్రంగా కాకినాడ కాజాలని చెప్పొచ్చు కదా అని అనుకున్నాడు. ప్రత్యేకహోదా కోసం మీరెవరూ ఉద్యమాలు చేయొద్దు, ఎంపీలు, ఎమ్మెల్యేలను చేయనివ్వండి... వాళ్లు కూడా ఫెయిలైతే చివరిలో నేనొస్తాను... సినిమాలలో హీరో ఎంట్రయ్యి విలన్‌పై విజయం సాధించేది క్లైమాక్స్‌లోనే... అని పవన్ చెప్పుకుపోతున్నాడు. అపరిచితుడు అక్కడ నీరుగారిపోయాడు. నీ మొహం మీద మజ్జిగపులుసు పొయ్యా... రేప్ సీన్ అయిపోయాక హీరో వచ్చినట్లుగా వుంది నువ్వు చెప్పేది... నీ సినిమా బుద్ధిని పోనిచ్చుకున్నావు కాదు, నీ దగ్గర మాటలు తప్పితే నీ గన్‌లో తూటాలు లేవనుకుంటూ అపరిచితుడు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండడంతో నేరుగా అక్కడకు వెళ్లాడు. తెలుగుదేశం ఎమ్మెల్యేలంతా చేతుల్లో లడ్డులతో హాల్‌లోకి రాసాగారు. అపరిచితుడు ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులును ఆపి... ఈ లడ్డుల పంచాయితీ ఏంటని అడిగాడు. ఇవి మోడీ స్పెషల్ లడ్లు... మా కోసం పంపించారు అని చెప్పి లోపలకు వెళ్లిపోయాడు. తర్వాత నల్లచొక్కాలతో జగన్ బ్యాచ్ వచ్చింది. జగన్‌తో అపరిచితుడు... సార్, ఎవరు చనిపోయారు, సంతాప సూచకంగా నల్లచొక్కాలేసుకుని వచ్చారని ప్రశ్నించాడు. దానికి జగన్... ప్రత్యేకహోదా ఆశను చంపేసారు... నిరుద్యోగుల కలలను చంపేసారు... అంటూ ఆవేశంగా లోపలకు వెళ్లిపోయాడు. ప్రత్యేకహోదా మీద ఈరోజు అసెంబ్లీలో వాడిగా వేడిగా చర్చ జరగడం ఖాయమనుకుంటూ అపరిచితుడు లోపలకెళ్లి గ్యాలరీలో కూర్చున్నాడు. ప్రత్యేకహోదా మీద చర్చ కావాలంటూ జగన్ బ్యాచ్ స్పీకర్ పోడియాన్ని చుట్టుముట్టగా... శాసనసభా వ్యవహారాల మంత్రి యనమల రామకృష్ణుడు లేచి... అధ్యక్షా! ఇక ఈ మూడురోజులు సభ ఇలాగే వుంటుంది... మనం హోదా మీద చర్చకు అనుమతించేదీ లేదు, వాళ్లు ఆందోళన విరమించేదీ లేదు. కాబట్టి తెలుగుదేశం సభ్యులకు నేను చేస్తున్న విన్నపం ఒక్కటే... ఇకముందు హైదరాబాద్‌లో సమావేశాలు నిర్వహించేది లేదు... కాబట్టి మీరంతా ఐమాక్స్‌లో సినిమాలు, హోటళ్లలో విందులతో ఎంజాయ్ చేసి వెళ్లండని చెప్పి కూర్చున్నాడు. అది విని ఆంధ్రా అపరిచితుడికి అరికాల్లో కాలింది. వీళ్లెవరికీ ఆంధ్రప్రదేశ్ పట్ల బాధ్యత లేదు.. డైరక్ట్ ఫైట్ టూ పీఎం.. ఫేస్ టు ఫేస్... మోడీని నేనే ఢీకొడతానంటూ అపరిచితుడు ఢిల్లీకి బయల్దేరాడు.

ఢిల్లీలోని ప్రధానమంత్రి కార్యాలయం. ఆంధ్రా అపరిచితుడు అప్పుడే అక్కడకు చేరుకున్నాడు. సరిగ్గా అదే సమయానికి ప్రధాని నరేంద్ర మోడీ కూడా వచ్చాడు. అపరిచితుడు ఆయనతో... సార్, మీరు ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసేటప్పుడు ఢిల్లీకి వచ్చాను, మళ్లీ ఇప్పుడే రావడం అని చెప్పాడు. అందుకు మోడీ.... నేను కూడా అంతే... ప్రమాణస్వీకారం తర్వాత విదేశాల పర్యటనకు వెళ్లాను. మళ్లీ ఇప్పుడే వస్తున్నాను. ఇంత బిజీగా తిరుగుతున్నా ఇంతవరకు 50దేశాలు కూడా పూర్తికాలేదు. ఇంకా 150దేశాలెప్పుడు తిరగాలో... అయినా నువ్వు ఎందుకొచ్చావో చెప్పు అని అడిగాడు. మా ఆంధ్రాకు ప్రత్యేకహోదా ఇస్తామని ఎన్నికల్లో వాగ్దానం చేసారు. ఇప్పుడు ఇవ్వలేమంటున్నారు. ఏమిటీ అన్యాయమని అపరిచితుడు ప్రశ్నించాడు. మోడీ స్పందిస్తూ... మీకు ప్రత్యేకహోదా సాధ్యం కాదుగాని, ప్రత్యేకంగా ఉప్పు మాత్రం ఇస్తామన్నాడు. సార్, స్పెల్లింగ్ మిస్టేక్... ఉప్పు కాదు, అప్పు అని అపరిచితుడన్నాడు. దానికి మోడీ... మీరు విన్నది కరక్టే... అప్పు కాదు, ఉప్పే... మహారాష్ట్ర నుండి గుజరాత్ విడిపోయినప్పుడు మేం ఉప్పు అమ్ముకునే అభివృద్ధి చెందామన్నాడు. మాకు ఉప్పు లేదుకదా అని అపరిచితుడు చెప్పాడు. మోడీ అందుకుని... మా గుజరాత్‌లో దండిగా వుంది కదా... మీకు అప్పు క్రింద ఉప్పు పంపిస్తాం... ఆ ఉప్పుకు ప్యాకేజీ నిధులను జమచేసుకుంటాం... ఇక మీరు ఉప్పు అమ్ముకుని హాయిగా బ్రతకొచ్చు... ఇక నేనుంటా... సాయంత్రం చైనాకు వెళ్లాలి అంటూ లోపలకు వెళ్లాడు. అప్పుడు ఆంధ్రా అపరిచితుడు తల 560కిలోమీటర్ల వేగంతో తిరగసాగింది.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

వృత్తి వ్యాపారాలు సామాన్యంగా సాగి ఆదాయం సామాన్యం. చేపట్టిన పనులను బాధ్యతాయుతంగా నిర్వహిస్తారు. అనవసర విషయాలలో జోక్యం చేసికొనకుండా జాగ్రత్తపడండి. ఖర్చులు ఎక్కువుగా ఉంటాయి. గృహ వస్తు వాహన రిపేర్లుంటాయి. స్థిరాస్తుల లావాదేవీలు వాయిదా వేసుకొనాలి. అనుకున్న పనులు నిదానంగా జరుగుతాయి.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ఆర్థిక అవరోధాలను అధిగమిస్తారు. ఆదాయం పెరుగుతుంది. పెట్టుబడులు లాభిస్తాయి. కొత్త పెట్టుబడులకు అవకాశాలు దొరుకుతాయి. బంధుముఖ్యులను పెద్దలను కలుసుకొంటారు. శుభకార్య ప్రయత్నాలు అనుకూలించగలవు. ప్రభుత్వం నుండి అనుమతులు లభించగలవు. అనుకున్న పనులు హడావుడిగా సాగుతాయి. ఆరోగ్యం బాగుంటుంది.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

కుటుంబంలోగాని, ఆర్థిక విషయాలలో గాని ముఖ్య నిర్ణయాలు చేసేటప్పుడు జాగ్రత్త అవసరం. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి బాగుండి ఆదాయం పెరుగుతుంది. ప్రభుత్వం నుండి చెల్లింపులు, అనుమతులు లభిస్తాయి. అనుకున్న పనులు పట్టుదలతో సాధించుకొంటారు. ప్రముఖులు, పెద్దవారితో పరిచయాలు ప్రయోజనకరంగా ఉంటాయి. విద్యార్థులకు మంచి ప్రగతి కలదు.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

వృత్తి వ్యాపారులకు, పారిశ్రామికవేత్తలకు ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరంగా ఉండి, ఆదాయం పెరుగుతుంది. ఆర్థిక లావాదేవీలను సమర్థవంతంగా నడుపుతారు. ఆరోగ్యం నిలకడగా ఉంటుంది. ఉద్యోగ ప్రయత్నాలు చేసేవారి కృషి ఫలిస్తుంది. రావలసిన బాకీలు కొంత లభించడం, కోర్టు వ్యవహారాలలో అనుకూలత ఉంటుంది. విద్యావృద్ధి కలదు.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

కొత్త పెట్టుబడులు, కొత్త వ్యాపారాలకు అవకాశాలు లభించగలవు. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి. అనుకున్న పనులు సమక్రమంగా జరిగినా టెన్షన్ ఎక్కువుగా ఉంటుంది. కుటుంబ సమస్యలను సామరస్యంగా సర్దుబాటు చేసికొనండి. ఇతరుల వల్ల విమర్శలు ఎదుర్కొనవలసి వస్తుంది. ఉద్యోగులు విధి నిర్వహణలో జాగ్రత్త పడండి. ఆరోగ్యం బాగుంటుంది.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

వృత్తి జీవనం కలవారికి ఆర్థిక స్థితి బాగుంటుంది. రాబడి తృప్తికరం. వ్యవసాయ వ్యాపార వర్గాలు ఆర్థిక ఇబ్బందులు పడతాయి. పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు మరింత శ్రమించాలి. ప్రభుత్వ అనుమతులు, ఋణాలు లభించగలవు. శుభకార్య నిర్ణయాలు వాయిదా పడతాయి. మంచి పనులకు సహాయం చేస్తారు. జరపబోవు పనులకు చర్చలు, ప్రణాళికలు రూపొందించుతారు.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

## రాశి – మీ వాసి

తేది. 16.9.2016 నుండి

తేది. 22.9.2016 వరకు

ఈ వారం కుంభ మీన మేష వృషభ రాశులలో చంద్రుడు, సింహంలో బుధ రాహువులు, కన్యలో రవిగురు శుక్రులు, 18తేది నుండి తులలో శుక్రుడు, వృశ్చికంలో శనికుజులు, 18తేది నుండి ధనుస్సులో కుజ, కుంభంలో కేతువు సంచరిస్తారు.

### పంచాంగము:

తేది 17 శనివారము మహాలయపక్ష ప్రారంభము.

తేది 20 మంగళవారము భరణి మహాలయము.

### భాద్రపద కృష్ణపక్ష తిధులు

| | | | |
|---|---|---|---|
| తేది. 16 | శుక్ర | పూర్ణిమ | రా॥ గం.12.56వ॥ |
| తేది. 17 | శని | పాడ్యమి | రా॥ గం.11.04వ॥ |
| తేది. 18 | ఆది | విదియ | రా॥ గం.8.55వ॥ |
| తేది. 19 | సోమ | తదియ | రా॥ గం.6.36వ॥ |
| తేది. 20 | మంగళ | చతుర్థి | సా॥ గం.4.12వ॥ |
| తేది. 21 | బుధ | పంచమి | ప॥ గం.1.45వ॥ |
| తేది. 22 | గురు | షష్ఠి | ప॥ గం.11.23వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

వ్యవహారాలలో ప్రతికూలత, అనుకున్న పనులు వాయిదా పడటం జరుగుతాయి. వృత్తి వ్యాపారాలకు ఆర్థిక ఇబ్బందులు, రాబడి తగ్గడం ఉంటుంది. కుటుంబ సభ్యులతో భేదాభిప్రాయాలుంటాయి. ప్రభుత్వ అనుమతులు ఆలస్యం కావచ్చును. కొత్త పెట్టుబడుల విషయంలో తొందరపడతారు. ముఖ్యమైన విషయాలు నిర్ణయం తీసికొనే లోపు, సన్నిహితులతో చర్చించండి.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

సమస్యలను తెగేదాకా లాగవద్దు. సామరస్యంగా పరిష్కరించుకొనండి. వ్యవహారాలందు ఇతరులను సంప్రదించి నిర్ణయాలు చేయాలి. వృత్తి వ్యాపార పారిశ్రామిక వర్గాలకు మంచి ఆర్థికాభివృద్ధి కలిగి ఆదాయం పెరుగుతుంది. అనుకున్న పనులు పట్టుదలతో సాధిస్తారు. కొత్త పరిచయాలు ప్రయోజనాన్ని కలిగిస్తాయి. విలువైన వస్తువులు, పరికరాలు కొంటారు.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

సొంత పనులు, కార్యక్రమాలు అనుకున్న విధంగా సాగవు. ఆటంకాలు కలుగుతాయి. సమావేశాలలో చర్చలలో పాల్గొంటారు. అదనపు ఖర్చులు ఎక్కువగా ఉంటాయి. యజమానులకు వర్కర్లతో సమస్యలుంటాయి. చెల్లింపులు సకాలంలో జరుపుతారు. వ్యాపార పారిశ్రామిక రంగాలలో మంచి ఆర్థికావకాశాలు లభించగలవు. ఆదాయం పెరుగుతుంది.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఆర్థిక, స్థిరాస్తుల లావాదేవీలు వాయిదా వేసికొనండి. బంధుముఖ్యుల నుండి అనారోగ్య వార్తలు వింటారు. వ్యాపార అవకాశాలు చేజారిపోవచ్చును. వృత్తి వ్యాపార పారిశ్రామిక వర్గాలకు ఆర్థిక ఇబ్బందులుండి రాబడి తగ్గుతుంది. అనుకోని ప్రయణాలుంటాయి. కుటుంబ సౌఖ్యము, విద్యా ప్రగతి ఉంటుంది. రావలసిన బాకీలు నిలబడిపోతాయి. స్టాకిస్టులు మెలకువగా ఉండండి.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

వ్యాపార నిర్వహణలో సంతృప్తి ఉండదు. వృత్తి వ్యాపారాలలో ఆదాయం సామాన్యం. అనుకున్న పనులు సరిగా జరగక టెన్షన్ పడతారు. మనస్సు ప్రశాంతంగా ఉండదు. ప్రభుత్వ అనుమతులందు ఆలస్యం, వస్తు వాహన ఇంటి రిపేర్ల ఖర్చులుంటాయి. దైవ, ఆధ్యాత్మిక విషయాలందు శ్రద్ధ చూపుతారు. అనవసర ప్రయాణాలు చేయవలసి రావచ్చును. చదువులపై దృష్టి పెట్టండి.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఆర్థిక ఇబ్బందులను అధిగమించే ప్రయత్నాలు ఫలించగలవు. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా సాగి, ఆదాయం షుమారుగా ఉంటుంది. కోర్టు వ్యవహారాలు ఇబ్బంది కలిగిస్తాయి. బంధువులతో సంయమనం పాటించి నడుచుకొనండి. అనుకున్న పనులు నెరవేరగలవు. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు లభించగలవు. విద్యా ప్రగతి బాగుంటుంది.

# డా॥ యం.యస్.సుబ్బులక్ష్మి శతజయంతి ఉత్సవాలు



నెల్లూరు సింహపురి కల్చరల్ అకాడమీ, సంస్కృతి తరంగాలు సంయుక్త ఆధ్వర్యంలో నెల్లూరు టౌన్‌హాల్లో సోమవారం నుండి బుధవారం వరకు మూడురోజుల పాటు భారతరత్న డా॥ యం.యస్.సుబ్బులక్ష్మి శతజయంతి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. తొలిరోజు సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ భారతదేశ సంస్కృతి విలువలు ఎక్కడికీ పోవని, ఇలాంటి మంచి కార్యక్రమాలు నిర్వహించిన నిర్వాహకులు అభినందనీయులని కొనియాడారు. ఈ సందర్భంగా చెన్నైకి చెందిన విఘ్నేష్ ఈశ్వరన్ గాత్రకచేరి వీనుల విందుగా సాగింది. దేవరాల సుబ్రహ్మణ్యంయాదవ్, కొండా బలరామిరెడ్డి, పంచాగ్నుల విశ్వనాథం అతిథులుగా పాల్గొన్నారు. మంగళవారం జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న నెల్లూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి మాట్లాడుతూ భారతదేశంలో కీర్తింపబడ్డ సుబ్బులక్ష్మి ప్రపంచ దేశాల్లో సైతం గుర్తింపు పొందారని, ఐక్యరాజ్యసమితిలో సంగీత కార్యక్రమాలను ఏర్పాటు చేసిన ఘనత ఆమెకే దక్కిందన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ డోలు విద్వాంసుడు నెల్లూరు మస్తాన్‌బాబు కాలిఫోర్నియా బర్కిలి యూనివర్శిటీ గౌరవ డాక్టరేట్ పురస్కారం అందుకున్న సందర్భంగా ఆయన్ను ముఖ్యఅతిథులు ఘనంగా సత్కరించారు. కూచిపూడి నృత్యకళాకారిణిలు కుమారి ఎం.ఆశ్రితారెడ్డిని, కుమారి లాస్యను పద్మశ్రీ అవసరాల కన్యాకుమారి, ముఖ్యఅతిథులు పూలమాలలతో సత్కరించారు. అనంతరం పద్మశ్రీ కన్యాకుమారి వయోలిన్ కచేరి ఆద్యంతం వీనులవిందుగా సాగింది. వాకాటి విజయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. బుధవారం జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి మాట్లాడుతూ కళలను, కళాకారులను ప్రోత్సహించాలన్నారు. తెలుగుదేశం పార్టీ జిల్లా నాయకులు పెళ్ళకూరు శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ సంగీత నృత్యాలను అందరూ ఆదరించాలని కోరారు. ఈ సందర్భంగా నృత్య అధ్యాపకులు పుష్పం, అనీల్‌కృష్ణ, చెన్నైకి చెందిన అమర్‌నాథ్‌ల కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలు మైమరపించాయి. అనంతరం ప్రముఖ జానపద నృత్య కళాకారుడు పున్నూరు నారాయణమూర్తిని ప్రముఖ డోలు విద్వాంసులు ఇనుకొండ నాగరాజును, శ్రీకృష్ణ ధర్మరాజుల దేవస్థానం పాలకమండలి సభ్యులు వరదా పవన్‌కుమార్‌లను ముఖ్యఅతిథులు అభినందించి సత్కరించారు. ఈ మూడురోజుల కార్యక్రమాలను సింహపురి కల్చరల్ అకాడమీ గౌరవ సలహాదారు సి.మునికుమార్, సంస్కృతి తరంగాలు వ్యవస్థాపకులు రేణిగుంట రాజశేఖర్‌లు పర్యవేక్షించారు. సింహపురి ప్రజలు, కళాకారులు, కళాభిమానులు, సంగీతాభిమానులు విశేషంగా పాల్గొని జయప్రదం చేశారు.

# నేత్రపర్వంగా శ్రీవారి కళ్యాణం



శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని బుధవారం నెల్లూరు దర్గామిట్టలో వున్న టిటిడి కళ్యాణ మండపంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ శ్రీనివాస కళ్యాణం నేత్రపర్వంగా జరిగింది. ఈ సందర్భంగా టిటిడి కళ్యాణమండపం భక్తుల గోవిందనామ స్మరణలతో మార్మోగింది. టిటిడి ధర్మప్రచార మండలి, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ వేదపండితులు వేదగిరి ఫణిశర్మ, నాగేంద్ర పాల్గొని స్వామివారికి శాస్త్రోక్తంగా కళ్యాణోత్సవం, పుష్పాభిషేకం నిర్వహించారు. టిటిడి ధర్మప్రచార మండలి అధ్యక్షుడు సివి సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షుడు కొండా శేఖరరెడ్డి తదితరులు ఈ వేడుకలను పర్యవేక్షించారు. ప్రముఖ భక్తిగీతాల గాయకుడు గుండాల గురవయ్య ఈ సందర్భంగా అన్నమయ్య కీర్తనలను అద్భుతంగా ఆలపించారు. అనంతరం, భక్తులందరికీ టిటిడి లడ్డూ ప్రసాదాలను అందజేశారు.

# కోర్టు ప్రాంగణంలో కట్టుదిట్టమైన భద్రత కావాలి

నెల్లూరులోని జిల్లా కోర్టు ప్రాంగణంలో ఇటీవల జరిగిన బాంబు పేలుడు జరగడం దారుణమని, కోర్టు ఆవరణలో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని బార్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డి.ఫణిరత్నం, ఆర్.రోజారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కోర్టు ఆవరణలో జరిగిన బాంబు పేలుడు సంఘటనకు నిరసనగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జిల్లా కోర్టు ప్రైవేటు ద్వారాల వద్ద, వివిధ కోర్టుల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు, భద్రత కోసం గార్డులను నియమించాలని కోరారు. బాంబు పేలుడు ఘటనకు సంబంధించి ఉన్నతాధికారులు దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని, అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గట్టి చర్యలు చేపట్టాలని వారు కోరారు.


4వ వర్ధంతి

మా తల్లి గారైన
శ్రీకంటి సుబ్బరత్నమ్మ గారు
దైవ సన్నిధి చేరి తేది.14.9.16కి
4సం॥లు గడిచాయి.
వారి జ్ఞాపకాలు మా మదిలో
చిరస్థాయిగా నిలిచేవుంటాయి.
మీ పవిత్ర ఆత్మకు శాంతి
కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...



స్వర్గీయ శ్రీకంటి సుబ్బరత్నమ్మ గారు
W/o లేట్ ఎస్.వి.రత్నం గారు
కవి & ఆడిటర్, గూడూరు.

కుమారులు - కోడళ్ళు
శ్రీకంటి నాగరాజరావు - మాలతి
శ్రీకంటి రామమోహన్‌రావు - రాజ్యలక్ష్మి
శ్రీకంటి రమణమూర్తి - సీతమ్మ

కుమార్తెలు - అల్లుళ్ళు
కారుమంచి ఇందిర - అనంతపద్మనాభరావు
యరగుడిపాటి వసంత - ప్రభాకరరావు
మద్దాలి వసుప్రద - వెంకట కృష్ణారావు

మనుమరాలు
వెంకట మంజుప్రీతి - కామేశ్వర్
మునిమనుమళ్ళు
ఆర్యన్, ఎస్.వి.మనోజ్‌కుమార్




# కావలి కబుర్లు

# ప్రత్యేక ప్యాకేజీతోనే రాష్ట్రం అభివృద్ధి

**- రఘునాథబాబు**



సమావేశంలో మాట్లాడుతున్న రఘునాథ బాబు

ప్రత్యేకహోదా కన్నా ప్రత్యేక ప్యాకేజీతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని భారతీయ జనతాపార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎడ్లపాటి రఘునాథబాబు పేర్కొన్నారు. కావలి పట్టణం ఒంగోలు బస్టాండు వద్దనున్న నమస్కార్ హెూటల్ సమావేశ మందిరంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర విభజన జరిగే సమయంలో ప్రత్యేకహోదా కావాలని రాజకీయంగా తెరపైకి తీసుకొచ్చింది అప్పుడు ఎంపీగా ఉన్న వెంకయ్యనాయుడే అన్నారు. హోదా జాప్యంతో రాష్ట్రాన్ని అభివృద్ధిచేసే బాధ్యత ఆయనపైన ఉంది కాబట్టే.. పెద్దఎత్తున నిధులు మంజూరు చేయిస్తున్నారన్నారు. నాడు మౌనంగా ఉన్న కాంగ్రెస్, మిగిలిన పార్టీలు నేడు ప్రత్యేకహోదాపై మాట్లాడడం సరికాదన్నారు. నీతి అయోగ్ చట్టం ఏర్పాటుచేయడం జరిగింది.అందువల్ల అనేక అంశాలు చర్చించాల్సింది. అప్పటిలోపు ప్యాకేజిద్వారా రాష్ట్రానికి నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేయాలనే ఆలోచనతో భారతీయజనతా పార్టీ ఉందన్నారు. వంద శాతం కేంద్రం నిధులతోనే పోలవరం పూర్తిచేసేందుకు సంసిద్ధంగా మోదీ ఉన్నారన్నారు. సినీ హీరో పవన్‌కళ్యాణ్ రాజకీయ అవగాహనలేక దుందుడుకుగా మాట్లాడుతున్నారన్నారు. ఆయన మాటలవల్ల బీజేపీకి ఎలాంటి నష్టం కలగదని తెలిపారు. ఈ సమావేశంలో భాజపా జిల్లా ఉపాధ్యక్షులు భరత్‌కుమార్, నియోజకవర్గ ఇన్‌చార్జి సీవీసీ సత్యం, పట్టణ అధ్యక్షులు రంగారెడ్డి, సీనియర్ నాయకులు చలువాది సత్యం, రాష్ట్ర మహిళామోర్చా నాయకురాలు వరలక్ష్మీ, కిసాన్‌మోర్చా జిల్లా నాయకులు కృష్ణారెడ్డి, దళిత మోర్చా నాయకులు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# ఉనికిని కాపాడుకునేందుకే ఉద్యమాలు

**- బిజేపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు కందుకూరి**



సమావేశంలో మాట్లాడుతున్న కందుకూరి

రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీలు తమ ఉనికిని కాపాడుకునేందుకే ప్రత్యేకహోదా అంశాన్ని ప్రజల సెంటిమెంటుగా మార్చి ఉద్యమాలు చేస్తున్నాయని బిజేపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు కందుకూరి వెంకట సత్యన్నారాయణ అన్నారు. ఇటీవల ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీలు రాష్ట్ర బంద్‌కు పిలుపు నివ్వటం సరైనది కాదన్నారు. అవకాశవాద రాజకీయాలతో రాష్ట్ర అభివృద్ధికి అడ్డు పడుతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంకి ప్రత్యేకహోదాకు సరి సమానంగా ఆర్ధిక సహాయం ప్రకటించిందని అన్నారు. ప్రజలను తప్పుతోవ పట్టించేందుకే బంద్‌లు అన్నారు. పోలవరాన్ని నిర్మించేందుకు అయ్యే ఖర్చును పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే భరిస్తుందని, నా బార్డు నుండి తీసుకున్న ఋణాలన్నింటినీ కేంద్ర ప్రభుత్వమే తీర్చేందుకు ఆమోదం తెలిపిందన్నారు. విభజన చట్టంలో ఉన్న అన్ని రకాల విద్యా సంస్థలు, విమానాశ్రయ ఏర్పాటు, ఓడ రేవుల నిర్మాణం ఏర్పాటుకు కేంద్రం నిధులు విడుదల చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అడుగులు వేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కావలి నియోజకవర్గ కన్వీనర్ సి.వి.సి సత్యం, దగదర్తి మండలాధ్యక్షులు శివరామిరెడ్డి, మహిళామోర్చా నాయకురాలు వరలక్ష్మి తధితరులు పాల్గొనారు.

# వైభవంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు





పట్టణంలో వినాయక చవితి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి . అనేక చోట్ల వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసినప్పటికీ కలుగోలమ్మపేట లోని కలుగోళశాంభవి ఆలయం ఆవరణంలో గణేశ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన వినాయక నవ రాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఇక్కడ ఏర్పాటు చేసిన 20 అడుగుల పంచముఖ గణనాధుడు ప్రత్యేక అలంకరణలతో భక్తులకు దర్శనమిచ్చాడు. ఉత్సవ కమిటీ అధ్యక్షులు, టిడిపి పట్టణ అధ్యక్షులు మలిశెట్టి వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో 9రోజులపాటు అత్యంత పవిత్రంగా ప్రత్యేక అర్చకులచే పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాదాలు అందజేశారు. నిత్యం దశ హారతి, ముత్తైదువులతో పూజలు, హోమాలు నిర్వహించారు. చివరిరోజు లడ్డు వేలంపాట నిర్వహించగా క్యాటరింగ్ రాము రూ,,55 వేలకు కైవశం చేసుకున్నారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించగా వేల సంఖ్యలో భక్తులు భోజనాలు చేశారు. ప్రతి రోజు తెలుగు సాంప్రదాయాలకు అద్దం పడుతూ బాల బాలికలతో దేవతా మూర్తుల వేషధారణలతో, భరత నాట్యం, కూచిపూడి, జానపద నాట్యాలతో అలరించారు. సినీ పాటకచేరి, డ్యాన్సబేబి డ్యాన్స్ కార్యక్రమాలు ఉత్సాహాన్ని నింపాయి. ఉట్టి కొట్టే కార్యక్రమం ఆలయ ఆవరణంలో ఉత్సాహభరితంగా సాగింది. ఈ విగ్రహం వద్ద ప్రముఖులు రాష్ట్ర రాజధాని నిర్మాణ కమిటీ సభ్యులు బీదా మస్తాన్‌రావు, ఎ ఎం సి చైర్మెన్ దేవరాల సుబ్రమణ్యం, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య, వైస్‌ఛైర్మెన్ గుండ్లపల్లి భరత్‌కుమార్, పట్టణ ప్రధాన కార్యదర్శి అమరా యాదగిరి, రాజ్‌కుమార్ చౌదరి, కౌన్సిలర్లు అమరా విజయలక్ష్మి, మలిశెట్టి విజయలక్ష్మి, శ్రీదేవి చౌదరి తదితరులు ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు.

# ఏపికి 'ప్రత్యేక' ద్రోహం

(మొదటి పేజీ తరువాయి)

ప్రజల మనోభావాలు, సమస్యలు తెలియవు. సుదీర్ఘకాలం గుజరాత్ సీఎంగా వుండి ఉన్నఫళంగా ప్రధాని అయ్యాడు. ఆయన పదవి మారినంత వేగంగా ఆలోచనలు మారవు కదా! ఏపికి ప్రత్యేకహోదా ఇస్తే తన గుజరాత్‌లో పారిశ్రామికాభివృద్ధి ఎక్కడ కుంటుపడుతుందోననే భయం కావచ్చు... ఏపికి ఈ విధంగా పంగనామాలు పెట్టాడు.

ఇదీగాకుండా నరేంద్రమోడీపై తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత ఒత్తిడి కూడా బలంగానే వుంది. ఏపికి ప్రత్యేక హోదా ఇస్తే మొదటి నష్టం పక్కనే వున్న తమిళనాడుకే! అక్కడ కంపెనీలన్నీ కూడా ఆంధ్రాకు క్యూ కట్టొచ్చు. దీన్ని దృష్టిలో పెట్టుకునే జయలలిత ఒత్తిడి తెచ్చుండొచ్చు. కేంద్రంలో ఎన్డీఏకు కూడా భవిష్యత్‌లో జయ అవసరం వుంది. రాజ్యసభలో ఆమె మద్దతు కావాలి. వచ్చే ఎన్నికల్లో ఆమెతో పొత్తు కావాలి. ఇక ఏపికి ప్రత్యేకహోదా ఇచ్చిన వెంటనే బీహార్, పశ్చిమబెంగాల్, ఒడిసా రాష్ట్రాలు కూడా ప్రత్యేకహోదాకు డిమాండ్ చేసే అవకాశాలున్నాయి. అలాగే వచ్చే ఏడాది ఛత్తీస్‌ఘడ్, హిమాచల్‌ప్రదేశ్, జార్ఖండ్ వంటి రాష్ట్రాల్లో ప్రత్యేకహోదాను ఎత్తేసే అవకాశాలున్నాయి. ఏపికి ప్రత్యేకహోదా ఇస్తే ఆ రాష్ట్రాల్లోని పరిశ్రమలన్నీ కూడా ఏపికి పరుగులు తీసే పరిస్థితి ఉంటుంది. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకునే మోడీ మన ముఖాన ప్యాకేజీ మూటేసాడు.

**చంద్రబాబును సైలెంట్ చేశారు...**

ప్రత్యేకహోదా కోసం ఎంత దాకానైనా పోరాడుతానని చెప్పిన చంద్రబాబు మోడీ ఇచ్చిన ప్యాకేజీనే మహాప్రసాదంగా స్వీకరించారు. చంద్రబాబు కేంద్రానికి ఎక్కడో బెండ్ అయ్యాడు. హోదాను ఫణంగా పెట్టాడు. ఎక్కడ లొంగాడన్న దానికి అనేక కారణాలు... ఒకటి ఓటు-నోటు కేసు ఆయనను నీడలా వెంటాడుతోంది. ఈ కేసు నుండి బయటపడాలంటే కేంద్రం సహకారం కావాలి.

ఇక హోదా సమాధి చేయడం వెనుక కేంద్రం-చంద్రబాబుల మధ్య రహస్య ఒప్పందాలు జరిగాయన్నది విశ్వసనీయ సమాచారం. ఇందులో మొదటిది పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించడం. కేంద్రం వెంటనే ఆ పని చేసింది కూడా! ఇంకోటి రాష్ట్రంలో శాసనసభ నియోజకవర్గాల సంఖ్యను 175 నుండి 225కు పెంచడం. దీనికి కూడా కేంద్రం తెరవెనుక పచ్చజెండా వూపినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో నియోజకవర్గాల సంఖ్య పెరగడం చంద్రబాబుకు ఆవశ్యం. వచ్చే ఎన్నికల్లో సీట్లిస్తామని చెప్పి వైకాపా నుండి 20మంది ఎమ్మెల్యేలను తెచ్చుకున్నాడు. ఆల్‌రెడీ పార్టీలో ఉన్నోళ్లతో పాటు వచ్చిన వాళ్లకు కూడా సీట్లివ్వాలంటే అసెంబ్లీలు పెరగాలి. 225 అసెంబ్లీలైతే వైకాపా నుండి ఇంకా కొంతమందిని లాగొచ్చని చంద్రబాబు ప్లాన్. తెలంగాణలోనూ సీట్ల సంఖ్య పెంచాలని కేసీఆర్ అడుగుతున్నాడు కాబట్టి... రెండు రాష్ట్రాలలోనూ ఒకేసారి చేయాలని ప్లాన్. అయితే ఈ బిల్లు లోక్‌సభలో నెగ్గినా రాజ్యసభలో గట్టెక్కే అవకాశం లేదు. అలాంటి పరిస్థితి వచ్చినా ఆర్డినెన్స్ ద్వారా నియోజకవర్గాల సంఖ్యను పెంచుతామని కేంద్రం నుండి బాబుకు భరోసా లభించినట్లు తెలుస్తోంది.

మొత్తానికి తేలిందేమిటంటే కేంద్రంలో ఎన్డీఏ ప్రయోజనాలు, రాష్ట్రంలో చంద్రబాబు రాజకీయ ప్రయోజనాల ముసుగులో ఆంధ్రా ప్రజల ప్రయోజనాలకు శాశ్వత సమాధి కట్టారు.

# మంత్రి కుర్చీ ఎవరిది?

(మొదటి పేజీ తరువాయి)

రెడ్డి సామాజిక వర్గం ఆధిపత్యం బలంగా వుండేది కడప, కర్నూలు, నెల్లూరుజిల్లాల్లో. ప్రకాశంలోనూ కొంతమేర ప్రభావం వుంది. కర్నూలు జిల్లాలో భూమా నాగిరెడ్డికి ఇస్తే సరిపోతుంది. ఇక నెల్లూరుజిల్లాలో ఖచ్చితంగా రెడ్లను క్యాబినెట్‌లోకి తీసుకోవాల్సిన పరిస్థితి వుంది. జిల్లా నుండి పి.నారాయణ మంత్రిగా వున్నప్పటికి తెలుగుదేశంపార్టీకి రాజకీయంగా భారీ నష్టం తప్పితే నయాపైసా ఉపయోగం లేదు. మంత్రిగా ఆయన జిల్లా ప్రజలకు, కనీసం పార్టీ నాయకులు, కార్యకర్తలకు కూడా అందుబాటులో ఉండేది లేదు. ఆయన మూలంగా పార్టీకి నాయకులు, కార్యకర్తలు దూరమవుతున్నారు. వచ్చే ఎన్నికల దాకా జిల్లా నుండి మంత్రిగా నారాయణనే కొనసాగనిస్తే జిల్లాలో పార్టీకి తీరని నష్టం జరుగుతుంది. జిల్లాలో నష్ట నివారణ చర్యలు తీసుకోవాలంటే జిల్లా సమస్యలపై పూర్తి అవగాహన, కేడర్‌తో సత్సంబంధాలున్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని మంత్రివర్గంలోకి తీసుకోవడం మేలనే ఉద్దేశ్యం కనిపిస్తోంది. జిల్లాలో పెద్ద రాజకీయ వర్గం కలిగిన ఆనం సోదరులు పార్టీలో వున్నప్పటికి, నిన్నగాక మొన్న పార్టీలో చేరిన వారిని కేబినెట్‌లోకి తీసుకుంటే ఎవరూ హర్షించరు. కాబట్టి జిల్లా నుండి 'రెడ్డి' సామాజికవర్గంలో పట్టు నిలుపుకోవాలంటే సోమిరెడ్డిని మంత్రిని చేయొచ్చు. నారాయణను సిఆర్‌డిఏ ఛైర్మెన్‌గా పంపిస్తేనే సోమిరెడ్డి పదవికి మార్గం సుగమం అవుతుంది.

ఇక ఎమ్మెల్సీ మాగుంట శ్రీనివాసులురెడ్డి కూడా మంత్రి రేస్‌లో వున్నాడు. ఆయనను ఎమ్మెల్సీగా నిలబెట్టిందే మంత్రిపదవి ఇస్తామన్న హామీ మీద! మాగుంట శీనయ్య నెల్లూరు, ప్రకాశం జిల్లాలతో సంబంధం వున్న నాయకుడు. కాబట్టి నారాయణను మంత్రివర్గం నుండి తొలగించకుండా మాగుంట శీనయ్యను మంత్రిని చేస్తే ప్రకాశంతో పాటు నెల్లూరుజిల్లాను కూడా కవర్ చేస్తాడంటున్నారు. అయితే ఇది సక్సెస్ కాదు. మాగుంట ఫుల్‌టైం రాజకీయవేత్త కాదు. మంత్రిని చేసినా కూడా ఆయన ప్రకాశం జిల్లాలోనే పూర్తిగా నెట్టుకు రాలేడు. ఇక నెల్లూరుజిల్లా రాజకీయాల్నేం చూడగలడు. కాబట్టి అన్ని విధాలా నెల్లూరుజిల్లా నుండి సోమిరెడ్డిని మంత్రిని చేయడమే ఉత్తమమని ఆ పార్టీ కార్యకర్తల అభిప్రాయం.

# పవన్ యాక్షన్

(మొదటి పేజీ తరువాయి)

బహిరంగ సభలు ఏర్పాటు చేయడంగాని, భారీ జనసమీకరణ, భారీ బందోబస్తు... ఇవన్నీ కూడా అధికారం అండలేకుండా జరిగేవి కావు.

ఏపికి ప్రత్యేకహోదా ఇవ్వాల్సింది ప్రధానిగా నరేంద్రమోడీ! ఆయన ఇవ్వనంటే పోరాడి తేవాల్సింది రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు. పవన్ కళ్యాణ్ ఇద్దరి జోలికి పోవడం లేదు. మధ్యలో వెంకయ్యనాయుడి మీద పడ్డాడు. విభజన సమయంలో వెంకయ్య ప్రత్యేక హోదా ఐదేళ్లు కాదు పదేళ్లు కావాలని పోరాడింది నిజమే! ఈరోజు దానిని ప్రధానికి గుర్తు చేయగలడేగాని, మోడీని ఎందుకివ్వవు అని నిలదీసి తెచ్చేంత సీన్ వెంకయ్యకు లేదు. మోడీ చెప్పినట్లు తలాడించడమే ఆయన పని. వెంకయ్య పార్టీ కావాలనుకుంటే హోదాను వదులుకోవాలి, హోదా కావాలంటే పార్టీని వదిలిరావాలి.

కాని చంద్రబాబు పరిస్థితి అది కాదు. హోదా ఇవ్వకుంటే ఆయన కేంద్రంతో విభేదించవచ్చు. ఎన్డీఏ నుండి బయటకు రావచ్చు. హోదాకై ఉద్యమం నడపవచ్చు. ఆయన ఆ పని చేయకుండా మోడీ ఇచ్చిన ప్యాకేజీ లడ్డూలే చాలనుకున్నాడు. మరి హోదాపై మాట మార్చిన చంద్రబాబును పవన్ పల్లెత్తు మాట అనలేదు. కేవలం వెంకయ్యనే లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేసాడు. ఇదంతా చూస్తుంటే పవన్ సొంతంగా ఏమీచేయడం లేదని, చంద్రబాబు డైరెక్షన్‌లో 'రబ్బర్ సింగ్' సినిమా చూపిస్తున్నాడని అర్థమవుతోంది.

# నెల్లూరుపై ఉగ్రనీడ?

(మొదటి పేజీ తరువాయి)

ఈ నెల 12వ తేదీన నెల్లూరులోని జిల్లా కోర్టు ఆవరణలో ప్రహరీగోడ వద్ద గుర్తు తెలియని దుండగులు ప్రెషర్‌కుక్కర్ బాంబు పేల్చారు. ఈ పేలుడువల్ల సమీప గోడ దెబ్బతింది. సమీపంలో ఎవరూ మనుషులు లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. అరలీటర్ సామర్థ్యంగల ప్రెషర్ కుక్కర్‌ను టిఫిన్ బ్యాగ్‌లో అమర్చి 9వోల్ట్స్ బ్యాటరీలను పేలుడుకు ఉపయోగించారు. పేలుడు సంభవించగానే స్థానికంగా ఉన్నోళ్లు భయభ్రాంతులకు గురయ్యారు. ఒక్క నిముషం ఏం జరిగిందో అర్థం కాలేదు. బాంబు పేలుడు గురించి తెలియగానే గుంటూరులో వున్న ఎస్పీ విశాల్‌గున్నీ వెంటనే నెల్లూరుకు చేరుకున్నారు. పోలీసులు వెంటనే రంగంలోకి దిగి బాంబు పేలుడు వెనుకవున్న కారణాలపై అన్వేషణ మొదలు పెట్టారు. ఈ బాంబు పేలుడుపై ఉగ్రనీడ లున్నాయని తెలుస్తోంది. కక్షల కోణంలో జరిగుంటే నాటుబాంబులను మాత్రమే ప్రయోగించేవాళ్లు. ప్రెషర్‌కుక్కర్ బాంబులను పేల్చే టెక్నాలజీ ఉండేది మావోయిస్టులు, టెర్రరిస్టుల వద్దే! రాష్ట్రంలో మావోయిస్టుల కదలికలే లేవు. ఇక ఉగ్రవాదం కోణంలోనే ఆలోచించాల్సి వస్తోంది. తమిళనాడు కేంద్రంగా పని చేసే ఆల్ ఉమా అనే ఉగ్రవాద సంస్థపై అనుమానాలున్నాయి. ఇటీవల చిత్తూరుజిల్లా కోర్టు ప్రాంగణంతో పాటు మరికొన్ని చోట్ల కూడా ఇదే తరహా బాంబు పేలుళ్లు జరిగాయి. ఉగ్రవాద సంస్థ తమ ఉనికిని చాటుకోవడానికి, అలాగే ప్రజల మధ్య సామరస్య వాతావరణాన్ని చెడగొట్టడానికే ఈ బాంబును పేల్చినట్లు భావిస్తున్నారు. ఈ బాంబు పేలుడును పోలీసు శాఖ సీరియస్‌గా తీసుకుంది. ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి ఈ బాంబు పేలుడుపై దర్యాప్తును వేగవంతం చేశాయి. త్వరలోనే దీనికి సంబంధించి నిజాలు బయపడొచ్చు.

# మన స్వాతంత్ర్యవీరులు

(2వ పేజీ తరువాయి)

| క్ర.సం | పేరు | ఊరు |
|---|---|---|
| 377 | వెంకటరమణారావు కటికనేని | వెంకటగిరి |
| 378 | వెంకటరమణారెడ్డి బండి | గంగపట్నం నెల్లూరు తాలూకా |
| 379 | వెంకటరమణారెడ్డి చెన్నారెడ్డి | కావలి |
| 380 | వెంకటరమణారెడ్డి దువ్వూరు | పల్లిపాడు నెల్లూరు తాలూకా |
| 381 | వెంకటరమణారెడ్డి కనుపూరు | మరుపూరు రాపూరు తాలూకా |
| 382 | వెంకటరమణారెడ్డి తుంగా | ముంగమూరు కావలి తాలూకా |
| 383 | వెంకటరమణారెడ్డి వేమారెడ్డి | పెదపుత్తేడు కోవూరు తాలూకా |
| 384 | వెంకటరమణయ్య నాగిశెట్టి | మడమనూరు నెల్లూరు తాలూకా |
| 385 | వెంకటరామయ్య రాయి | దగదర్తి కోవూరు తాలూకా |
| 386 | వెంకటరావు | కావలి |
| 387 | వెంకటరావు అక్కిలి | ఉదయగిరి తాలూకా |
| 388 | వెంకటరావు వడ్లమాని | నెల్లూరు |
| 389 | వెంకటరత్నం బైనా | ఊటుకూరు కోవూరు తాలూకా |
| 390 | వెంకటరెడ్డి జయంపు | మడమనూరు నెల్లూరు తాలూకా |
| 391 | వెంకటరెడ్డి మల్లు | జయంపు వెంకటగిరి తాలూకా |
| 392 | వెంకటరెడ్డి పెనుమల్లి అలియాస్ వెంకురెడ్డి | పెదపుత్తేడు కోవూరు తాలూకా |
| 393 | వెంకటరెడ్డి సోమవరపు | పొట్టేపాళెం నెల్లూరు తాలూకా |
| 394 | వెంకటరెడ్డి వేనాటి | వెండ్లూరు సూళ్ళూరుపేట తాలూకా |
| 395 | వెంకటశేషయ్య మొల్లూరు | నార్తురాజుపాళెం కోవూరు తాలూకా |
| 396 | వెంకటశేషయ్య నావూరు | నావూరు ఆత్మకూరు తాలూకా |
| 397 | వెంకటసుబ్బమ్మ రెంటాల | పల్లిపాడు నెల్లూరు తాలూకా |
| 398 | వెంకటసుబ్బారెడ్డి అన్నంరెడ్డి | మడమనూరు నెల్లూరు తాలూకా |
| 399 | వెంకటసుబ్బారెడ్డి నలగట్ల | అల్లూరు కోవూరు తాలూకా |
| 400 | వెంకటసుబ్బారెడ్డి శ్రీపట్నం | కొరటూరు నెల్లూరు తాలూకా |
| 401 | వెంకటసుబ్బారెడ్డి వంకవోలు | చెర్లోపల్లి రాపూరు తాలూకా |
| 402 | వెంకటసుబ్బయ్య ఆనెమళ్ళ | నార్తుమోపూరు కోవూరు తాలూకా |
| 403 | వెంకటసుబ్బయ్య చెందెమాల | నావూరు ఆత్మకూరు తాలూకా |
| 404 | వెంకటసుబ్బయ్య చౌక్కా | నెల్లూరు |
| 405 | వెంకటసుబ్బయ్య గుంటూరు | బుచ్చిరెడ్డిపాళెం కోవూరు తాలూకా |
| 406 | వెంకటసుబ్బయ్య గుంటూరు | చినమాచనూరు ఉదయగిరి తాలూకా |
| 407 | వెంకటసుబ్బయ్య కనుపర్తి | నావూరు ఆత్మకూరు తాలూకా |
| 408 | వెంకటసుబ్బయ్య మంకరాజు | విరూరు ఆత్మకూరు తాలూకా |
| 409 | వెంకటసుబ్బయ్య ఓరుగంటి | కావలి |
| 410 | వెంకటసుబ్బయ్య రావు | నాయుడుపేట సూళ్ళూరుపేట తాలూకా |
| 411 | వెంకటసుబ్బయ్య తలుపూరు | సూళ్ళూరుపేట |
| 412 | వెంకటసుబ్బయ్య వెంటా | వెంకటగిరి |
| 413 | వెంకటస్వామి ఆవుల | మడమనూరు నెల్లూరు తాలూకా |
| 414 | వెంకటస్వామి చిట్టమూరు | మడమనూరు నెల్లూరు తాలూకా |
| 415 | వెంకటస్వామినాయుడు మాదాసు | సూళ్ళూరుపేట |
| 416 | వెంకటస్వామిరెడ్డి కలికి | మడమనూరు నెల్లూరు తాలూకా |
| 417 | వెంకటేశ్వరశర్మ ఓరుగంటి | కావలి |
| 418 | వెంకటేశ్వర్లు పరంజి | వెంకటగిరి |
| 419 | వెంకటేశ్వర్లు పేడూరు | కావలి |
| 420 | వెంకటేశ్వర్లు పెండెం | కావలి |
| 421 | వెంకయ్య చేశెట్టి | నాయుడుపేట |
| 422 | వెంకయ్య గాదిరాజు | కోవూరు |
| 423 | వెంకయ్య ఓ | నెల్లూరుజిల్లా |
| 424 | వెంకయ్య పసుపులేటి | మడమనూరు నెల్లూరు తాలూకా |
| 425 | వెంకురెడ్డి డేగా | మైపాడు నెల్లూరు తాలూకా |
| 426 | వెంకురెడ్డి ఇసనాక | యల్లాయపాళెం కోవూరు తాలూకా |
| 427 | వెంకురెడ్డి కనుపూరు | కొమ్మలపూడి నెల్లూరు తాలూకా |
| 428 | వేణుగోపాలరెడ్డి యరబోలు | అల్లూరు కోవూరు తాలూకా |
| 429 | వీరరాఘవరెడ్డి మేనకూరు | బుచ్చిరెడ్డిపాళెం |
| 430 | వీరరాఘవరెడ్డి పొన్నలూరు | గూడూరు |
| 431 | వీరరాఘవరెడ్డి రామలింగం | గోగులపల్లి కోవూరు తాలూకా |
| 432 | వీరరాఘవయ్య అరిగెల | నెల్లూరు |
| 433 | వీరరాఘవయ్య | నాగసూరు కావలి |
| 434 | వీరారెడ్డి మలుచూరు | పెదపుత్తేడు కోవూరు తాలూకా |
| 435 | వీరారెడ్డి సోమారెడ్డి | దామరమడుగు కోవూరు తాలూకా |
| 436 | వీరారెడ్డి వంజవాక | అల్లూరు కోవూరు తాలూకా |
| 437 | వీరసుబ్రహ్మణ్యం గుద్దేటి | గూడూరు |
| 438 | వీరేశలింగం పవ్వాల | కొత్తవంగల్లు కోవూరు తాలూకా |
| 439 | విశ్వనాధం అప్పకాయల | గూడూరు |
| 440 | యానాది కామిశెట్టి | వెంకటగిరి |
| 441 | యానాదిశెట్టి పచ్చిగోళ్ళ | చెన్నూరు గూడూరు తాలూకా |
| 442 | యతిరాజమ్మ కందాడై | నెల్లూరు |
| 443 | యలమందారెడ్డి తిప్పారెడ్డి | జలదంకి కావలి తాలూకా |

(సమాప్తం)

## శాస్త్ర సాంకేతిక రంగాల్లో

# మరిన్ని నూతన ఆవిష్కరణలు జరగాలి

### - ప్రఖ్యాత శాస్త్రవేత్త డాక్టర్ జి.సతీష్‌రెడ్డి ఆకాంక్ష



మన దేశం అంతరిక్ష శాస్త్ర విజ్ఞానంలోనూ, క్షిపణి సాంకేతిక రంగాల్లోనూ ఎన్నో అద్భుతాలు సాధిస్తోందని, ఆ విజయాలు మన శాస్త్ర సాంకేతిక ప్రజ్ఞాపాటవాలను నిరూపిస్తున్నాయని, ఈ విజయాలను మనం పదిలపరుచుకుంటూనే మరెన్నో నూతన ఆవిష్కరణలకు సమాయత్తం కావాలని కేంద్ర రక్షణశాఖ మంత్రి శాస్త్ర సాంకేతిక సలహాదారుడు, మిసైల్స్, స్ట్రాటజిక్ సిస్టమ్స్ డైరెక్టర్ జనరల్–డిఆర్‌డిఓ డాక్టర్ జి.సతీష్‌రెడ్డి అన్నారు. తమిళనాడులోని తంజావూరులో వున్న శాస్త్ర విశ్వవిద్యాలయం వారు డాక్టర్ సతీష్‌రెడ్డికి ఇటీవల విజ్ఞానశాస్త్రంలో గౌరవ డాక్టరేట్ పట్టాను బహుకరించారు. ఈ సందర్భంగా సతీష్‌రెడ్డి ఆ విద్యాలయం 30వ స్నాతకోత్సవంలో ప్రసంగించారు. విద్య, ఆర్థిక, శాస్త్ర సాంకేతిక రంగాల్లో దృఢంగా వున్నప్పుడే దేశం దృఢంగా వుంటుందన్నారు. సింధూలోయ నాగరికత బయటపడిన నాటినుంచి నేటి కాలం దాకా శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఎన్నో మార్పులు వచ్చాయని, మన దేశం పలు పరిశోధనా రంగాల్లో ప్రశంసించదగిన స్థాయిలో కృషి చేయడం హర్షణీయమని అన్నారు. మెరుగైన వ్యవస్థలను అభివృద్ధి పరచడంలోనూ, మన దేశ రక్షణకు సంబంధించిన సాంకేతిక అంశాల్లోనూ గొప్ప మార్పులు చేసుకుంటున్నాయని, సాంకేతిక రంగంలో సాధించిన స్వయంప్రతిపత్తితో మన దేశం ఇతరదేశాలకు ధీటుగా ఎంతో ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తోందని అన్నారు. ఇప్పుడు మనం కేవలం సాంకేతిక కొనుగోలుదారులం కాదని, ఆయా అంశాల్లో మనం తగినంత అనుభవాన్ని గడించామని అన్నారు. పరిశోధన మరియు అభివృద్ధి సంస్థలు, విద్యాలయాలు, మరియు పారిశ్రామిక రంగం, ఒకదానికొకటి తోడ్పడి, నూతన సాధనాలను, నాణ్యత గల ఉత్పత్తులను అందించి ఆయా రంగాల్లో మరిన్ని సేవలందించాలని ఆయన ఆకాంక్షించారు.

# ప్యాకేజీ వెనుక రహస్య ఒప్పందం

### కాకాణి గోవర్ధన్‌రెడ్డి



ఏపికి ప్రకటించిన ప్రత్యేక ప్యాకేజీ వెనుక తెలుగుదేశం, బీజేపీల మధ్య రహస్య ఒప్పందం ఉందని వైకాపా జిల్లా అధ్యక్షుడు, సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆరోపించాడు. 15వ తేదీ నెల్లూరులోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రత్యేకహోదా విషయంలో చంద్రబాబు ప్రవర్తన మొదటి నుండి అనుమానంగానే వుందన్నారు. ఆయన ప్రజలకు ఉపయోగపడే హోదా కంటే తన పార్టీవారికి ఉపయోగపడే ప్యాకేజీపైనే ప్రేమ చూపారు. ప్రత్యేకహోదా ఇవ్వకుంటే తన రక్తం సలసల కాగిపోతుందని గతంలో చంద్రబాబు అన్నారు. ఇప్పుడు ప్యాకేజీతో ఆయన రక్తం చల్లబడినట్లుందని, రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై ఏ మాత్రం స్పందించడం లేదని కాకాణి విమర్శించాడు. ఏ అర్ధరాత్రి అయితే కాంగ్రెస్ విభజన ప్రకటన చేసి రాష్ట్రానికి ద్రోహం చేసిందో, అదే అర్ధరాత్రి బీజేపీ కూడా హోదా లేదని చెప్పి ఏపికి తీరని ద్రోహం చేసిందన్నారు. చంద్రబాబుతో మాట్లాడే ప్యాకేజీ ప్రకటించామని వెంకయ్యనాయుడు చెప్పారని, చంద్రబాబు మాత్రం తనకేమీ తెలియదంటున్నాడని, కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలో చంద్రబాబులు కలిసే రాష్ట్రం గొంతు కోసారని అన్నారు.

ఈ సమావేశంలో నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్, పార్టీ సిఇసి సభ్యులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, నెల్లూరు డిప్యూటీ మేయర్ యం.ద్వారకానాథ్, కార్పొరేషన్ వైసిపి ఫ్లోర్‌లీడర్ పి.రూప్‌కుమార్‌యాదవ్, వెంకటాచలం జడ్పీటీసీ ఎం.వెంకటశేషయ్యులు పాల్గొన్నారు.

# అక్రమ నియామకాలపై అక్షింతలు

## విఎస్‌యూ పాలకుల నిర్వాకంపై హైకోర్టు ఆగ్రహం



***అక్రమాలకు అడ్డాగా వివాదాలకు వేదికగా మారిన నెల్లూరులోని విక్రమసింహపురి విశ్వవిద్యాలయం పాలకవర్గంపై హైకోర్టు సీరియస్ అయ్యింది. ప్రభుత్వ చట్టాలు, నిబంధనలకు లోబడే అధికారులు వ్యవహరించాలని, రిజర్వేషన్లను పాటించకుండా వైస్‌ఛాన్స్‌లర్, రిజిస్ట్రార్‌లు యూనివర్శిటీ తమ జాగీర్ అన్నట్లు ఇష్టం వచ్చినట్లు నియామకాలు చేపడితే చూస్తూ వూరుకునేది లేదని హైకోర్టు హెచ్చరించింది. ఇప్పటిదాకా జరిపిన నియామకాలపై తమకు వారంలోగా పూర్తి వివరాలను అందజేయాలంటూ ఈ నెల 12వ తేదీన ఆదేశించింది.***

విక్రమ సింహపురి యూనివర్శిటీలో అక్రమాలు, వివాదాలు పరాకాష్టకు చేరాయి. ఆచార్య జయరామిరెడ్డి విసిగా వున్నవరకు ఎంతో పద్ధతిగా నడిచిన యూనివర్శిటీ ఆయన వెళ్లిపోయాక దారితప్పింది. వచ్చిన పాలకులూ దారితప్పారు. పాలకులకు వ్యతిరేకంగా విద్యార్థి సంఘాలు ఆందోళనలకు దిగసాగాయి. యూనివర్శిటీలో ప్రతిదీ సమస్యే! ఇటీవల వృత్తివిద్యాకోర్సు పరీక్షలు, హాస్టళ్ల మూత వంటివాటిపై కూడా ఆందోళనలు జరగడం చూసాం. ముఖ్యంగా యూనివర్శిటీలో 84మంది గెస్ట్ ఫ్యాకల్టీల నియామకాలు వివాదాస్పదంగా మారాయి. 2009లో 84మంది గెస్ట్ ఫ్యాకల్టీలను నియమించారు. ఆరేడు వేల జీతాలతో మొదలైన వాళ్లు ఇప్పుడు 15వేలు దాకా తీసుకుంటున్నారు. ఓ పక్క వాళ్లు తమను పర్మినెంట్ చేయాలని ప్రాధేయపడుతుండగా, పాలకవర్గం ఉన్నఫళంగా వారిని తొలగించి కొత్త నియామకాలు జరిపింది. ఈ నియామకాలు కూడా అన్నీ సిఫార్సులు, కమిషన్ల మీదే జరిగాయి. ఇప్పుడు జిల్లాకొక యూనివర్శిటీ వుంది. ఉద్యోగాలకు సంబంధించి ఆయా జిల్లాల వారికే ప్రాధాన్యతనివ్వాలి. కాని రిజిస్ట్రార్ అలా చేయకుండా స్టేట్‌వైడ్ నోటిఫికేషన్ ఇచ్చి, గెస్ట్‌ఫ్యాకల్టీ నియామకాలలో తన సొంత జిల్లా చిత్తూరు వారికి పెద్దపీట వేసాడు. దీనిపై టిఎన్‌ఎస్‌ఎఫ్ వంటి విద్యార్థి సంఘాలు గట్టిగానే పోరాడాయి. నోటిఫికేషన్‌లో రిజర్వేషన్ రోస్టర్‌ను తెలపలేదని, గెస్ట్ ఫ్యాకల్టీ నియామకాలను నిలిపివేయాలని టి.ఎస్.వెంకటేష్ అనే వ్యక్తి వేసిన పిటిషన్‌ను విచారించిన హైకోర్టు నియామకాలను నిలిపేయాలంటూ స్టే ఇచ్చింది. అయితే రిజిస్ట్రార్ శివశంకర్ హైకోర్టు స్టేను వెకేట్ చేయించకుండా, హైకోర్టుకు సమాచారం కూడా ఇవ్వకుండా 84మంది గెస్ట్ ఫ్యాకల్టీల నియామకాలను పూర్తి చేశాడు. దీంతో మరోసారి పిటిషనర్ హైకోర్టును ఆశ్రయించడంతో ఈ పిటిషన్‌ను విచారించిన న్యాయమూర్తి జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు పాలకవర్గాన్ని వాయించేశారు. వర్శిటీ అధికారులు రిజర్వేషన్ నిబంధనలు పాటిస్తున్నాం అని చెప్తే సరిపోతుందా, 84పోస్టులతో నియామక ప్రక్రియకు తెరతీసి నోటిఫికేషన్‌లో రోస్టర్‌ను ఎందుకు వివరించలేదని, ఎక్కడ కావాలంటే అక్కడ రిజర్వేషన్ పాటిస్తాం అని చెప్పడంలో వర్శిటీ అధికారుల ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు. తాత్కాలిక ఉద్యోగమైనా శాశ్వత ఉద్యోగం స్థానంలో భర్తీ కానున్నది కనుక ఖచ్చితంగా రిజర్వేషన్ పాటించాల్సిందేనని అలాకాకుండా తమకిష్టం వచ్చిన వారిని నియమించుకుంటాం అంటే చూస్తూ ఊరుకోం అని హెచ్చరించారు. గెస్ట్ ఫ్యాకల్టీల నియామకం అంటూ తమకిష్టం వచ్చిన వారిని ఓ నియామక పద్ధతి లేకుండా నిబంధనలకు విరుద్ధంగా ఎలా నియమిస్తారని ప్రశ్నించారు. స్వయం ప్రతిపత్తి కలిగిన యూనివర్శిటీలలో విసి, రిజిస్ట్రార్‌లు అంతా తమ ఇష్టం అంటే కుదరదని, వారు ప్రభుత్వ నిబంధనలకు, చట్టాలకు లోబడే వ్యవహరించుకోవాలని మండిపడ్డారు. ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులు ఇస్తుంటే నిబంధనలకు, చట్టాలకు లోబడి వ్యవహరించకుండా అంతా తమ ఇష్టమంటూ విసి, రిజిస్ట్రార్‌లు వర్శిటీలను భ్రష్టు పట్టిస్తూ ఉంటే చూస్తూ ఊరుకోమని, ఈ విధానం వర్శిటీల మనుగడకు, అస్తిత్వానికి ప్రమాదకరంగా మారుతుందని, ఇలాంటివి కొనసాగితే వర్శిటీని మూసేయాల్సిందిగా ప్రభుత్వానికి సిఫారసు చేయాల్సి వస్తుందని ఘాటైన విమర్శలు చేశారు. రిజర్వేషన్ నిబంధనలపై నోటిఫికేషన్‌లో ఖచ్చితమైన సమాచారం లేకుండా స్టేని ఎలా ఎత్తేయాలని తెలుపుతూ విఎస్‌యులో ఇప్పటివరకు జరిగిన నియామకాలు, పెండింగ్ నియామకాలు, పలు జీవోలతో పూర్తిస్థాయి సమాచారాన్ని వారంలో తమ ముందుంచాలని వర్శిటీ న్యాయవాదులకు తెలియజేస్తూ తదుపరి విచారణను వచ్చే సోమవారానికి వాయిదా వేశారు. ఇదిలా ఉండగా ఉన్న ఉద్యోగాలను కోల్పోయి గత మూడు నెలలుగా జీతాలు లేక విలపిస్తున్న పలువురు కాంట్రాక్టు అధ్యాపకులు తమని కొనసాగించాలని హైకోర్టులో వేసిన పిటిషన్ కూడా వచ్చే సోమవారమే విచారణకు రానుంది.




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com